మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 27-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 359 Issue: 359

27 జూన్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి త్రయోదశి రా. 12:43ం వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అనురాధ రా. 10:04 వరకు తరువాత జ్యేష్ఠ యోగం సాధ్య మ. 12:24 వరకు కరణం కౌలవ ఉ. 11:32 వరకు తైతుల రా. 12:43ం వరకు వర్జ్యం తె. 4:28 నుండి ఉ. 6:16 వరకు దుర్ముహూర్తం ఉ. 7:32 నుండి ఉ. 8:24 వరకు రాహుకాలం ఉ. 9:03 నుండి ఉ. 10:41 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:34 వరకు గుళికకాలం తె. 5:48 నుండి ఉ. 7:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు ఉ. 10:29 నుండి మ. 12:17 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:45 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana




## వానను నేను.. వస్తున్నా!

### నైరుతికి తోడైన ద్రోణి.. 5 రోజులు జోరు వానలు.. తెలుగు రాష్ట్రాలకు హెచ్చరికలు

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎండల వేడి నుంచి ఉపశమనం లభించినప్పటికీ, ఇప్పుడు కురుస్తున్న భారీ వర్షాలు జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసేలా కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజుకోవడంతో రాబోయే వారం పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం స్పష్టం చేసింది.

హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): ఈ వర్షాలకు ప్రధానంగా రెండు బలమైన వాతావరణ వ్యవస్థలు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. కోస్తా ఆంధ్ర నుంచి తెలంగాణ మీదుగా మధ్య మహారాష్ట్ర వరకు ఒక ఉపరితల ద్రోణి విస్తరించి ఉంది. ఈశాన్య, తూర్పు మధ్య బంగాళాఖాతం మీదుగా బలమైన ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో సముద్రం నుంచి తేమతో కూడిన గాలులు వేగంగా భూభాగం వైపు వీస్తున్నాయి. ఈ రెండు వ్యవస్థ కలయిక వల్ల మేఘాలు దట్టగా అలుముకొని ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు దారితీస్తోంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన తరువాయి 2 వ పేజీలో...




## యాసపై ఎకసెక్కాలు!

'ఇడుపు కాయితం' టైటిల్‌పై తుంటరి వ్యాఖ్యలు

ఆంధ్రాలో తెలుగు డబ్బింగ్ ఉంటుందా? అని పోస్ట్

భగ్గుమన్న తెలంగాణ సమాజం

దద్దరిల్లిన సోషల్ మీడియా

(ఈవార్తలు ప్రత్యేక కథనం)

నటుడు ప్రియదర్శి, ఫోక్ డ్యాన్సర్ నాగదుర్గ కలిసి చేస్తున్న సినిమా 'ఇడుపు కాయితం'. ఈ సినిమా పేరే ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ప్రాంతీయ భాషా గౌరవం, సాంస్కృతిక ఆత్మగౌరవం, పరస్పర గౌరవ భావనల వరకు చర్చ తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజు

హైదరాబాద్, జూన్ 2 (ఈవార్తలు): తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి, ప్రస్తుతం కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజు తెలంగాణకు తిరిగి వచ్చారు. -2 వ పేజీలో...

## పలువురు ఐఏఎస్‌ల బదిలీ



## భారతీయుడివేనా?


- ఇండియన్ అనేందుకు రుజువు ఏంటి?
- పాస్‌పోర్టు పౌరసత్వ రుజువు కాదన్న కేంద్రం
- పౌరసత్వ పత్రాలపై ప్రజల్లో అయోమయం

ఆధార్ కార్డు ఆధారం కాదన్నారు..
పాన్ కార్డు పనికిరాదన్నారు..
రేషన్ కార్డు అక్కరకు రాదన్నారు..
ఓటరు కార్డు ఓటుకే పనికొద్దన్నారు..
పాస్‌పోర్టు బస్ టికెట్ లెక్క అన్నారు..

మరి.. భారతీయుడేనన్న గుర్తింపేది..?
పౌరసత్వానికి అసలైన రుజువేది..?

(ఈవార్తలు - ప్రత్యేకం)

భారతదేశంలో పౌరసత్వంపై చర్చలు కొత్తవి కావు. కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం న్యాయస్థానంలో చేసిన ఒక కీలక వ్యాఖ్య ఈ అంశాన్ని మరోసారి జాతీయ చర్చగా మార్చింది. పాస్‌పోర్ట్‌ను భారత పౌరసత్వానికి కచ్చితమైన రుజువుగా పరిగణించలేమని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పాస్‌పోర్ట్ - 2 వ పేజీలో...




## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,606 |
| వెండి (కిలో): | రూ.2,75,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,810 |

## ఆపరేషన్ సిందూర్‌లో 'ఆరుగురు' అమరులు

వీర మరణం పొందిన జవాన్ల జాబితా విడుదల

నేషనల్ వార్ మెమోరియల్‌లోని గ్రానైట్ పలకలపై పేర్లు

వారిలో తెలుగు జవాను అగ్నివీర్ మురళీ నాయక్

న్యూఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా సరిహద్దుల్లో వీరోచితంగా పోరాడి దేశం కోసం ప్రాణాలర్పించిన ఆరుగురు సైనిక సిబ్బంది పేర్లను భారత ప్రభుత్వం తొలిసారిగా అధికారికంగా ప్రకటించింది. దేశ రక్షణ కోసం వారు చేసిన అత్యున్నత త్యాగానికి గుర్తుగా న్యూఢిల్లీలోని నేషనల్ వార్ మెమోరియల్ (జాతీయ యుద్ధ స్మారకం) లోని ప్రత్యేక గ్రానైట్ పలకలపై వీరి పేర్లను శాశ్వతంగా చెక్కనున్నట్లు తెలిపింది. ఈ భీకర ఆపరేషన్‌లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఒక సర్జెంట్ వీరమరణం పొందారు.

తరువాయి 2 వ పేజీలో...




## వాడకం అంటే మనోళ్లదే!




దేశంలో మొత్తం 12 కోట్ల క్రెడిట్ కార్డులు


మే నెలలో 587 మిలియన్ల లావాదేవీలు

విలువ రూ.2.65 ట్రిలియన్లుగా నమోదు


దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం మళ్లీ ఊపందుకుంది. ఏప్రిల్‌లో స్వల్ప మందగమనం తర్వాత మే నెలలో కార్డు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. డిజిటల్ చెల్లింపులు, ఈ-కామర్స్ విస్తరణతో పాటు చిన్న మొత్తాల కొనుగోళ్లకు కూడా క్రెడిట్ కార్డులను వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది.

న్యూఢిల్లీ: 2026 మే నెలలో క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన మొత్తం లావాదేవీల విలువ రూ.2.65 ట్రిలియన్లకు చేరుకుంది. ఇది గత ఏడాది మే నెలతో పోలిస్తే 6.6 శాతం, ఏప్రిల్‌తో పోలిస్తే 2.6 శాతం అధికం. ఇదే సమయంలో దేశంలో మొత్తం క్రెడిట్ కార్డుల సంఖ్య 12.05 కోట్లకు చేరుకోవడం మరో కీలక మైలురాయిగా నిలిచింది. ఒక్క మే నెలలోనే దాదాపు 10 లక్షల కొత్త కార్డులు జారీ కావడంతో గత 15 నెలల్లో తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి




అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రానికి చెందిన 2.5 లక్షల మందికి పైగా ప్రజలకు స్నాప్‌చాట్ సహవ్యవస్థాపకుడు ఇవాన్ స్పీగెల్, ఆయన భార్య మిరాండా కెర్ భారీ ఊరటనిచ్చారు. సుమారు 550 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.4,700 కోట్లకు పైగా) విలువైన వైద్య రుణాలను వారు మాఫీ చేయించారు. ఈ సాయం కోసం ఎలాంటి దరఖాస్తులు, ఫీజులు లేదా షరతులు లేకుండా అర్హులైన కుటుంబాలకు నేరుగా లేఖలు పంపించి, వారి వైద్య రుణాలను పూర్తిగా రద్దు చేసినట్లు తెలియజేశారు.




## హార్మూజ్ వెరీ బిజీ

అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ అనంతరం హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు సాధారణ స్థితికి చేరటంతో ఆ ప్రాంతం అంతా నౌకలతో బిజీగా కనిపిస్తోంది. ఒక్కసారిగా ట్రాఫిక్ పెరిగింది. అటు.. నౌకల రాకపోకల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టాయి.

టెహ్రాన్: శుక్రవారం బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు సుమారు 1.9 శాతం తగ్గి 74.08 డాలర్లకు చేరగా, అమెరికా వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర 2.1 శాతం -2 వ పేజీలో...

## ఆపిల్.. ఆసియా.. ఆవిరి!

ఏషియా స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

కొరియా కోస్పీ 8.2%, జపాన్ నిక్కీ 5% పతనం

చిప్ వ్యయాలు, ప్రాఫిట్ బుకింగ్‌తో భారీ అమ్మకాలు

20 నిమిషాల పాటు కొరియాలో ట్రేడింగ్ నిలిపివేత



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలోని షేర్లలో భారీ అమ్మకాలు ఆసియా స్టాక్ మార్కెట్లను కుదిపేశాయి. దక్షిణ కొరియా కోస్పీ సూచీ శుక్రవారం 8.2 శాతం కుప్పకూలగా, జపాన్ నిక్కీ 225 సూచీ దాదాపు 5 శాతం నష్టపోయింది. తీవ్ర అమ్మకాలతో కొరియా స్టాక్ ఎక్స్ఛేంజ్ 20 నిమిషాల పాటు ప్రోగ్రామ్ ట్రేడింగ్‌ను నిలిపివేసింది.

న్యూఢిల్లీ: మొహర్రం నేపథ్యంలో ఈరోజు భారత స్టాక్ మార్కెట్లు పనిచేయడం లేదు. హాంకాంగ్ హ్యాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా సీఎస్ఐ300 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ 2 శాతానికి పైగా పడిపోయాయి. జపాన్‌ను మినహాయించిన ఎంఎస్‌సీఐ ఆసియా-పసిఫిక్ సూచీ కూడా 3.8 శాతం క్షీణించింది. గత ఏడాది కాలంలో ఇదే అతిపెద్ద వారాంత పతనంగా మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ అమ్మకాలకు అమెరికా టెక్ దిగ్గజం యాపిల్ ప్రధాన కారణంగా నిలిచింది. మెమరీ, స్టోరేజ్ చిప్‌ల ధరలు పెరగడంతో ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను పెంచుతున్నట్లు యాపిల్ ప్రకటించింది. దీంతో కంపెనీ తరువాయి 2 వ పేజీలో...



## అయోధ్య విరాళాలు.. 8 మంది అరెస్టు

అయోధ్య: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి ఆలయానికి భక్తులు సమర్పించిన విరాళాల నిధుల దుర్వినియోగం వ్యవహారంలో ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కీలక చర్యలు చేపట్టారు. ఆలయ విరాళాల లెక్కింపు ప్రక్రియతో సంబంధం ఉన్న ఎనిమిది మంది నిందితులను గురువారం రాత్రి అయోధ్యలోనే అరెస్ట్ చేసినట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు. ఈ నెల ప్రారంభంలో విరాళాల తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

27.6.2026

మేషం: చేపట్టిన పనులలో జాప్యం కలిగినప్పటికి నిదానంగా పూర్తిచేస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సన్నిహితుల నుండి వివాదాలకు సంబంధించిన సమాచారం అందుతుంది. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో చర్చలు సఫలమౌతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ప్రయాణ లాభలున్నవి.

వృషభం: సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది. ఊహించని విధంగా ఇతరులతో విరోధాలు కలుగుతాయి. కుటుంబ సభ్యులు మీ మాటతో విభేదిస్తారు. గృహమున విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

మిధునం: మాతృ వర్గం వారితో మాటపట్టింపులు ఉంటాయి. పాత ఋణాలు తీర్చగలుగుతారు. చేపట్టిన పనులలో అడ్డంకులు తప్పవు. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. వ్యాపారాలలో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ధైర్య సాహసాలతో నిర్ణయాలు తీసుకుంటారు. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. నూతన వస్త్ర ఆభరణాలను కొనుగోలు చేస్తారు. అన్ని వైపుల నుండి ఆర్థిక లాభాలు అందుతాయి. కీలక వ్యవహారాలలో వృత్తి వ్యాపారాలు ఆశించిన విధంగా సాగుతాయి. సోదరులతో సంబంధ బాంధవ్యాలు మెరుగుపడతాయి.

సింహం: ఇంటా బయట ఊహించని సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యులతో మనస్పర్ధలు తప్పవు. ప్రారంభించిన పనులు మందగిస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు అంతగా కలసిరావు. ధన పరమైన విషయాలలో ఇతరులకు మాట ఇవ్వడం మంచిది కాదు.

కన్య: వృత్తి వ్యాపారాలలో నష్టాలు అధిగమించి లాభాలను అందుకుంటారు. ఉద్యోగమున అధికారులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్త వ్యవహారించాలి. ఆదాయం పెరుగుతుంది. ఇంటాబయట సమస్యలు ఉన్నప్పటికీ నిదానంగా పరిష్కరించుకుంటారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

తుల: దూర ప్రయాణ సూచనలున్నవి. అనుకోని విధంగా ఖర్చులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. కొన్ని వ్యవహారాలలో ఊహించని ఇబ్బందులు ఎదురవుతాయి. వృత్తి ఉద్యోగాలలో అధికారులతో నిదానంగా వ్యవహరించాలి. వ్యాపారాల్లో ఆశించిన రీతిలో లాభించవు.

వృశ్చికం: దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. సంతానానికి నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. శారీరక మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇతరుల సహాయ సహకారాలతో కొన్ని సమస్యల నుంచి బయటపడతారు. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల నుండి ఉపశమనం పొందుతారు. వ్యాపారాల విస్తరణకు శ్రీకారం చుడతారు.

ధనస్సు: ఉద్యోగస్తులు ఉన్నత పదవులు పొందుతారు. కొన్ని వ్యవహారాలలో ఆత్మవిశ్వాసంతో స్థిర నిర్ణయాలు చేసి లాభపడతారు. దాయాదులతో స్థిరాస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. నిరుద్యోగులు వారికి లభించిన అవకాశాలను జారవిడువకుండా చూసుకోవాలి. ఇంటా బయటా గౌరవ మర్యాదలు పెరుగుతాయి.

మకరం: సంతాన వివాహ ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది. సమాజంలో కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. తల్లి తండ్రుల ఆరోగ్య విషయంలో శుభవార్తలు అందుతాయి.

కుంభం: ధన వ్యవహారాలలో ఇతరులకు మాట ఇచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటారు. వృత్తి ఉద్యోగాలలో నిలకడ లోపిస్తుంది. అనుకున్న సమయానికి అనుకున్న రీతిలో సౌకర్యాలు లభించక ఇబ్బందిపడతారు. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. శారీరక మానసిక అనారోగ్య సమస్యలు మరింత బాధిస్తాయి.

మీనం: జీవిత భాగస్వామి బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి. బంధుమిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో సఖ్యతగా వ్యవహరించి ప్రశంసలు అందుకుంటారు.

# భారతీయుడివేనా?

తరువాయి 2 వ పేజీలో...

చట్టం ప్రకారం అది ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, పాస్‌పోర్ట్ జారీ కావడం వల్ల మాత్రమే పౌరసత్వం నిరూపితం చేయదని పేర్కొంది. ఈ నేపథ్యంలో "అసలు భారత పౌరసత్వానికి రుజువు ఏమిటి?" అనే ప్రశ్న మళ్లీ ముందుకు వచ్చింది. ఈ పరిణామం ఒక మౌలిక సమస్యను వెలుగులోకి తెచ్చింది. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఇప్పటికీ ప్రతి పౌరుడు చూపించగల ఒకే ఒక్క స్పష్టమైన పౌరసత్వ ధ్రువీకరణ పత్రం లేదు. గుర్తింపు కోసం ఒక పత్రం, చిరునామా కోసం మరో పత్రం, సంక్షేమ పథకాలకు ఇంకో పత్రం, ఓటు హక్కుకు వేరొక పత్రం... ఇలా అనేక పత్రాలు ఉన్నా, వాటిలో ఏది పౌరసత్వానికి తుది రుజువు అనే విషయంలో సాధారణ ప్రజలకు స్పష్టత లేదు. దేశంలో ఎక్కువ మంది ఆధార్ కార్డును పౌరసత్వ ధ్రువీకరణగా భావిస్తారు. కానీ ఆధార్ చట్టం ప్రకారం అది గుర్తింపు మరియు నివాస ధ్రువీకరణ మాత్రమే; పౌరసత్వానికి రుజువు కాదు. అలాగే ఓటరు గుర్తింపు కార్డు ఎన్నికల్లో ఓటు వేయడానికి అర్హతను సూచిస్తుంది. పాన్ కార్డు ఆదాయపు పన్ను వ్యవహారాలకు సంబంధించినది. డ్రైవింగ్ లైసెన్స్ వాహనం నడిపే అనుమతి. రేషన్ కార్డు సంక్షేమ పథకాల అమలుకు ఉపయోగపడుతుంది. ఈ పత్రాలేవీ స్వతంత్రంగా భారత పౌరసత్వాన్ని నిరూపించవు. ఇప్పటివరకు సాధారణంగా పాస్‌పోర్ట్‌ను అత్యంత విశ్వసనీయ ప్రభుత్వ పత్రంగా పరిగణించేవారు. విదేశాలకు వెళ్లేందుకు అవసరమైన అధికారిక పత్రం కావడంతో దానిని పౌరసత్వానికి కూడా రుజువుగా భావించే అభిప్రాయం బలంగా ఉండేది. అయితే కేంద్రం తాజా వివరణ ఆ అభిప్రాయాన్ని సవాలు చేసింది. దీంతో సామాన్యుల్లో గందరగోళం మరింత




పెరిగింది. నిజానికి భారత పౌరసత్వం పౌరసత్వ చట్టం, 1955 ప్రకారం.. పుట్టుక, వంశపారంపర్యం, నమోదు, సహజీకరణ లేదా భూభాగం విలీనం వంటి మార్గాల ద్వారా పౌరసత్వం లభిస్తుంది. ఈ ప్రక్రియల ద్వారా కేంద్ర ప్రభుత్వం జారీ చేసే సిటిజెన్ షిప్ సర్టిఫికెట్, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నేచరలైజేషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలే నేరుగా పౌరసత్వాన్ని సూచిస్తాయి. అయితే దేశంలోని అధిక శాతం మంది పౌరులకు ఇటువంటి ప్రత్యేక ధ్రువీకరణ పత్రాలు ఉండవు. ఎందుకంటే వారు పుట్టుకతోనే భారత పౌరులు.

ఇదే అసలు సమస్య. పుట్టుకతో పౌరులైన కోట్ల మందికి ప్రత్యేక పౌరసత్వ ధ్రువీకరణ పత్రం లేకపోవడం, మరోవైపు అందుబాటులో ఉన్న సాధారణ పత్రాల్లో ఏదీ తుది రుజువు కాదని ప్రభుత్వం చెప్పడం ప్రజల్లో సందేహాలకు దారితీస్తోంది. ముఖ్యంగా ఓటరు జాబితాల సవరణ, జనాభా లెక్కలు, వలసలు, సరిహద్దు ప్రాంతాల భద్రత వంటి అంశాలు చర్చకు వచ్చిన ప్రతిసారి ఈ అనిశ్చితి మరింత స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్యంలో పౌరసత్వం అనేది కేవలం ఒక చట్టపరమైన హోదా మాత్రమే కాదు. ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రభుత్వ ఉద్యోగాలు, రాజ్యాంగ హక్కులు, జాతీయ భద్రత వంటి అనేక అంశాలకు అది పునాది. అలాంటి కీలక విషయంపై అస్పష్టత ఉండటం ప్రజలకు ఇబ్బందికరమే కాదు, పరిపాలనకూ సవాలే. అందువల్ల కేంద్ర ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఏ సందర్భంలో ఏ పత్రం చెల్లుతుంది? ఏ పత్రం పౌరసత్వానికి రుజువు కాదు? పుట్టుకతో భారత పౌరులైన వారు అవసరమైతే తమ పౌరసత్వాన్ని ఎలా నిరూపించాలి? వంటి ప్రశ్నలకు అధికారికంగా, సులభమైన భాషలో సమాధానాలు అందించాలి. చట్టపరమైన సాంకేతిక వివరణలు మాత్రమే కాకుండా, సాధారణ ప్రజలకు అర్థమయ్యే విధంగా అవగాహన కల్పించాలి. పత్రాల విషయంలో గందరగోళం ప్రజల తప్పు కాదు. వ్యవస్థలో ఉన్న అస్పష్టత వల్లే అది ఏర్పడుతోంది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలంటే పౌరసత్వ నిర్ధారణపై పారదర్శకత, ఏకరూప విధానం, స్పష్టమైన సమాచార వ్యవస్థ అవసరం. పౌరసత్వం విషయంలో సందేహాలకు తావులేని వ్యవస్థను రూపొందించడం ప్రజాస్వామ్యానికి, పరిపాలనకు, దేశ భవిష్యత్తుకు అత్యవసరం.

**పౌరసత్వ రుజువులుగా పరిగణించే పత్రాలు:**

- జనన ధ్రువీకరణ పత్రం (అవసరమైన సందర్భాల్లో తల్లిదండ్రుల వివరాలతో)
- పౌరసత్వ ధ్రువీకరణ పత్రం - నేచురలైజేషన్ సర్టిఫికెట్- రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్

**పౌరసత్వ రుజువులు కానివి:**

- ఆధార్ కార్డు, - ఓటరు గుర్తింపు కార్డు
- పాన్ కార్డు, - డ్రైవింగ్ లైసెన్స్
- రేషన్ కార్డు, - పాస్ పోర్టు

## ఆపిల్.. ఆసియా.. ఆవిరి!

మొదటి పేజీ తరువాయి

షేరు 6.1 శాతం పడిపోగా, ఒక్క రోజులోనే దాదాపు 250 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. పెరుగుతున్న చిప్ వ్యయాలు ఏఐ రంగం లాభాలపై ప్రభావం చూపుతాయనే ఆందోళన ఇన్వెస్టర్లలో పెరిగింది. అదే సమయంలో త్రైమాసికం ముగింపునకు రావడంతో పెట్టుబడిదారులు భారీగా లాభాల స్వీకరణకు మొగ్గు చూపారు. ఇప్పటికే ఏఐ షేర్ల విలువలు గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో రిస్క్ తగ్గించుకునేందుకు చాలామంది విక్రయాలు చేపట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇది ఏఐ బూమ్‌కు ముగింపు కాదని, ఇటీవల నమోదైన భారీ ర్యాలీ తర్వాత వచ్చిన సహజమైన కరెక్షన్‌గా మాత్రమే చూడాలని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణ సీఎస్‌గా సంజయ్ జాజు

మొదటి పేజీ తరువాయి

ప్రస్తుతం సీఎస్‌గా ఉన్న కే రామకృష్ణారావు పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. సంజయ్ జాజు ప్రస్తుతం ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. మూడు రోజుల కిందట ఆయన కేంద సర్వీసుల నుంచి రిలీవ్ అయ్యారు. ఆయనకు అంతకుముందు సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ ముఖ్యకార్యదర్శిగా, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా, విశాఖపట్టణం కమిషనర్‌గా, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా, సహాయ పునరావాస శాఖ కమిషనర్‌గా, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి శాఖ కమిషనర్‌గా, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీగా పనిచేసిన అనుభవం ఉంది.

## హర్మూజ్ వెరీ బిజీ

మొదటి పేజీ తరువాయి

పడిపోయి 70.41 డాలర్ల వద్ద నమోదైంది. విశ్లేషకుల సమాచారం ప్రకారం, హర్మూజ్ మార్గం ద్వారా ప్రపంచ చమురు సరఫరాలో దాదాపు ఐదో వంతు రవాణా జరుగుతుంది. అయితే మధ్యప్రాచ్యంలో భౌగోళిక ఉద్రిక్తతలు పూర్తిగా తగ్గిపోలేదని, ఒమాన్ తీరంలో ఒక సరుకు నౌకపై గుర్తుతెలియని దాడి జరిగిన ఘటన నేపథ్యంలో పరిస్థితులను పెట్టుబడిదారులు నిశితంగా గమనిస్తున్నారని మార్కెట్ నిపుణులు పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో 'ఆరుగురు' అమరులు

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ సింధూర్‌లో అమరులైన జవాన్లు వీరే:

సుబేదార్ మేజర్ పవన్ కుమార్ - హెడ్‌క్వార్టర్స్ 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్.

రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ - 4వ బెటాలియన్, జమ్మూ అండ్ కశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్.

లాన్స్ నాయక్ దినేశ్ కుమార్ - 5 ఫీల్డ్ రెజిమెంట్.

అగ్నివీర్ మూడ్ మురళీ నాయక్ - 851 లైట్ రెజిమెంట్ (మన తెలుగు రాష్ట్రానికి చెందిన వీరుడు కావడం విశేషం).

హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్.

సర్జెంట్ సురేంద్ర కుమార్ - 39 వింగ్, భారత వైమానిక దళం.

## వానను నేను.. వస్తున్నా!

మొదటి పేజీ తరువాయి

గాలులు వీస్తుండటం వల్ల పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ వర్షాల తీవ్రత ఈ నెలాఖరు వరకు మాత్రమే కాకుండా, జులై 2వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది. రాబోయే 24 గంటలు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో అత్యంత కీలకం. రాబోయే 48 గంటలు హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. శనివారం నుంచి జులై 2వరకు తెలంగాణ వ్యాప్తంగా నిరంతరాయంగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి.

### పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

తెలంగాణలోని జిల్లాలను వాతావరణ శాఖ రెండు వర్గాలుగా విభజించి హెచ్చరికలు జారీ చేసింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు వాతావరణ విభాగం ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.

### ఏపీలో అప్రమత్తం

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా కోస్తా జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఏలూరు,కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. తీర ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఈ ఏడాది రుతుపవనాలు ఆరంభంలో కాస్త నెమ్మదించినప్పటికీ జూన్ చివరి వారంలో అనూహ్యంగా పుంజుకున్నాయి. ఇది వ్యవసాయ పనులకు మేలు చేసే అంశమే అయినప్పటికీ ఒక్కసారిగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫ్లడింగ్ ముప్పు పొంచి ఉందని, ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో డ్రైనేజీ వ్యవస్థపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## అయోధ్య విరాళాలు.. 8 మంది అరెస్టు

మొదటి పేజీ తరువాయి

నిధుల మళ్లింపు ఆరోపణలు వెల్లువెత్తినప్పుడు.. ఉత్తరప్రదేశ్ డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్, శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ వీటిని తోసిపుచ్చారు. అయితే, వివాదం ముదరడంతో ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు యూపీ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. జూన్ 23న సిట్ తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. తర్వాత రెండు రోజులకే ఈ అరెస్టులు జరిగాయి. నిందితులపై భారతీయ న్యాయ సంహిత కింద దొంగతనం (సెక్షన్ 306), క్రిమినల్ నమ్మకద్రోహం (సెక్షన్ 316), దొంగిలించిన ఆస్తిని కలిగి ఉండటం (సెక్షన్ 317), క్రిమినల్ ప్లాన్/కుట్ర (సెక్షన్ 61) వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

## యాసపై ఎకసెక్కాలు!

మొదటి పేజీ తరువాయి

పెరిగింది. సినిమా టైటిల్‌ను ఎగతాళి చేస్తూ ఆంధ్రాకు చెందిన ఓ తుంటరి.. 'ఆంధ్రాలో తెలుగు డబ్బింగ్ ఉంటుందా?' అని చేసిన పోస్ట్ తెలంగాణ వాదుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపింది. తెలంగాణ యాసను హేళన చేసే వ్యాఖ్యలు చేయడం పట్ల సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ భాష, యాస, సంస్కృతి అనేవి కేవలం సంభాషణ సాధనాలు మాత్రమే కాదు, ఈ నేల చరిత్ర, జీవన విధానం, ప్రజల అనుభవాలు, సాహిత్య వారసత్వానికి ప్రతీకలు. అలాంటి యాసను అవహేళన చేయడం అంటే ఒక ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ వివాదంపై విద్యావేత్తలు, రచయితలు, సామాజిక వేత్తలు కూడా స్పందించారు. తెలంగాణ భాషను హాస్యాస్పదంగా చూపించే ప్రయత్నాలు సమాజంలో విభేదాలకు దారితీస్తాయని హెచ్చరిస్తూ, పరస్పర గౌరవాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెబుతున్నారు. ప్రముఖ విద్యావేత్త ఘంటా చక్రపాణి సహా పలువురు తెలంగాణ యాసపై చేసే ఎకసెక్కాలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి పన్నెండేళ్లు గడిచినా, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సామాజిక, సాంస్కృతిక, వ్యాపార, కుటుంబ బంధాలతో కలిసిమెలిసి జీవిస్తున్నారు. సాధారణ ప్రజల మధ్య పరస్పర గౌరవం, సహకారం కొనసాగుతుండగా, కొందరు వ్యక్తులు లేదా వర్గాలు కుల, ప్రాంతీయ ఆధిపత్య భావజాలంతో తెలంగాణ భాష, యాస, సంస్కృతిని లక్ష్యంగా చేసుకుని వ్యాఖ్యలు చేయడం అనవసర వివాదాలకు కారణమవుతోందని మేధావులు అంటున్నారు. భాషా వైవిధ్యం భారతదేశ బలమని, ఒక్కో ప్రాంతానికి ఒక్కో యాస సహజమని, దానిని హేళన చేయడం కన్నా గౌరవించడం నాగరిక సమాజ లక్షణమని పలువురు గుర్తుచేస్తున్నారు. ముఖ్యంగా సినిమా, సాహిత్యం, సామాజిక మాధ్యమాల ద్వారా స్థానిక భాషలకు ప్రాధాన్యం పెరుగుతున్న ఈ సమయంలో యాసలపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని పేర్కొంటున్నారు. తెలంగాణ ఉద్యమం భాషా గౌరవానికీ ప్రతీకగా నిలిచిందని, ఈ నేపథ్యంలో తెలంగాణ యాసను కించపరిచే ప్రయత్నాలు ప్రజల్లో సహజంగానే ప్రతిఘటనకు దారితీస్తాయని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. విమర్శలు, అభిప్రాయ భేదాలు ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ, ఒక ప్రాంత భాషను లేదా సంస్కృతిని అవమానించే వ్యక్తిగత దూషణలు, ఎగతాళి వ్యాఖ్యలు సమాజంలో అనవసర విద్వేషాలను పెంచే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. తెలుగు భాషకు అనేక యాసలు, పలుకుబడులు ఉన్నా, అవన్నీ సమాన గౌరవానికి అర్హమైనవే. భిన్నతను అవమానంగా కాకుండా, సాంస్కృతిక సంపదగా చూడగలిగితేనే సమాజంలో సుహృద్భావ వాతావరణం మరింత బలపడుతుంది.

## వాడకం అంటే మనోళ్లదే!

మొదటి పేజీ తరువాయి

అత్యధిక వార్షిక వృద్ధి రేటు (8.7 శాతం) నమోదైంది. క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. మే నెలలో మొత్తం 587 మిలియన్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఇది గత ఏడాదితో పోలిస్తే 25.8 శాతం అధికం. అయితే, ఒక్కో లావాదేవీపై సగటు ఖర్చు మాత్రం తగ్గుముఖం పట్టింది. చిన్న మొత్తాల కొనుగోళ్లకూ క్రెడిట్ కార్డుల వినియోగం పెరగడమే దీనికి ప్రధాన కారణమని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రధాన బ్యాంకుల పనితీరు మిశ్రమంగా కనిపించింది. కార్పొరేట్ వినియోగం పెరగడంతో ఎస్‌బీఐ కార్డుల సగటు వ్యయం వార్షిక ప్రాతిపదికన 12 శాతం పెరిగింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు వ్యయం నెలవారీగా 4.2 శాతం వృద్ధి నమోదు చేసింది. అయితే, పెరుగుతున్న వడ్డీ రేట్లు, రివార్డు పాయింట్ల విధానాల్లో బ్యాంకులు చేస్తున్న మార్పులు వినియోగదారుల ఖర్చు ధోరణిపై కొంత ప్రభావం చూపుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. అయినప్పటికీ, డిజిటల్ చెల్లింపుల విస్తరణతో దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# పలువురు ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం రేవంత్ సలహాదారుగా ప్రస్తుత సీఎస్ కె.రామకృష్ణరావును నియమించింది. మొత్తం 13 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగులు ఇచ్చింది. సీఎంవోలో కీలకంగా వ్యవహరించిన అజిత్‌రెడ్డిపై రేవంత్ సర్కార్ వేటు వేసింది. సీఎంవో నుంచి తొలగించి...ఇన్వెస్ట్మెంట్ సీఈఓ గా బాధ్యతలు ఇచ్చింది. ఎన్.శ్రీధర్‌కు సీఎంఓలో కీలక బాధ్యతలు అప్పగించింది. ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించింది. సబ్యసాచి ఘోష్‌కు హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖ అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. శైలజా రామయ్యర్‌కు ఈఎఫ్ఎస్ అండ్ టీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా బదిలీ చేసింది. అహ్మద్ నదీమ్‌కు పొలిటికల్ (జీఏడీ) ప్రిన్సిపల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చింది. ఎన్ శ్రీధర్ ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీగా, రాహుల్ బొజ్జాకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీగా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఎం.రఘునందన్ రావుకు మైన్స్ అండ్ జియాలజీ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం.. అజిత్ రెడ్డి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవోగా బదిలీ చేసింది. పి. కాత్యాయని దేవి హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం.. కె. గంగాధర్ ఆర్అండ్‌బీ శాఖ స్పెషల్ సెక్రటరీగా బదిలీ చేసింది. టి. వెంకన్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. కె. విద్యాసాగర్ టూరిజం డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కేంద్రం ప్రకటన అసంబద్ధం: శశిథరూర్

**పౌరసత్వానికి పాస్‌పోర్ట్ రుజువు కాదనటంపై ఫైర్**



న్యూఢిల్లీ: భారత పాస్‌పోర్ట్ అనేది కేవలం ఒక ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తిరుగులేని సాక్ష్యం కాదని విదేశాంగ శాఖ (ఎంఈఏ) చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ తీవ్రంగా స్పందించారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి సామాన్య పౌరుల విషయంలో అసంబద్ధమైన చట్టపరమైన వైరుధ్యాన్ని సృష్టిస్తోందని ఆయన శుక్రవారం విమర్శించారు. ఇటీవల 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా విదేశాంగ శాఖ ఈ వివరణ ఇచ్చింది. పాస్‌పోర్ట్ చట్టం–1967 ప్రకారం ఇది ఎప్పటి నుంచో ఉన్న నిబంధన అని, పౌరసత్వానికి పాస్‌పోర్ట్‌ను ఎన్నడూ తిరుగులేని ప్రామాణికంగా పరిగణించలేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ అంశంపై సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందించిన శశి థరూర్, దశాబ్దాలుగా పాస్‌పోర్ట్‌ను గుర్తింపునకు అత్యున్నత ప్రమాణంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. పోలీసు విచారణ, ధ్రువపత్రాల పరిశీలన వంటి కఠినమైన ప్రక్రియల అనంతరం ప్రభుత్వం జారీ చేసే పాస్‌పోర్ట్‌ను, పౌరసత్వానికి రుజువు కాదనడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు. పౌరసత్వాన్ని నిర్ధారించుకున్నాకే ఇచ్చే ఈ పత్రం కాకపోతే, మరేది పౌరసత్వానికి రుజువు? అని ఆయన ప్రశ్నించారు.

# ఫోక్స్‌వ్యాగన్‌లో లక్ష మందికి ఉద్వాసన?

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన ప్రముఖ కార్ల తయారీ దిగ్గజం ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్, తన చరిత్రలోనే అతిపెద్ద పునర్వ్యవస్థీకరణ చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా దాదాపు లక్ష ఉద్యోగాలను తొలగించడంతో పాటు, జర్మనీలోని పలు ఫ్యాక్టరీలను మూసివేయాలని, పెట్టుబడులను గణనీయంగా తగ్గించాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) ఆలివర్ బ్లూమ్ యోచిస్తున్నట్లు సమాచారం. 'మేనేజర్' మ్యాగజైన్ కథనం ప్రకారం, ఈ ప్రతిపాదనలకు కంపెనీ బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. రాబోయే ఐదేళ్లలో పెట్టుబడుల ప్రణాళికలో 15 శాతం కోత విధించి, మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోలకు తగ్గించాలని కంపెనీ భావిస్తోంది. అదే సమయంలో, ఫోక్స్‌వ్యాగన్ ప్యాసింజర్ కార్ల బ్రాండ్‌ను, దాని విడిభాగాల వ్యాపారాన్ని వేర్వేరు సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను సులభతరం చేసి, సామర్థ్యాన్ని మెరుగుపరచడమే ఈ మార్పుల లక్ష్యం. మరోవైపు, ఫ్యాక్టరీల మూసివేతను, ఉద్యోగాల కోతను తీవ్రంగా వ్యతిరేకిస్తామని అక్కడి కార్మిక సంఘాలు, ఐజీ మెటల్ యూనియన్ హెచ్చరించాయి. దీంతో భవిష్యత్తులో కార్మిక వివాదాలు తలెత్తే అవకాశం కనిపిస్తోంది.

# జబల్‌పూర్ బఠాణీలకు జీఐ ట్యాగ్

జబల్‌పూర్: వ్యవసాయ రంగంలో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. జబల్‌పూర్‌కు చెందిన ప్రసిద్ధ బఠాణీ (మటర్), సింఘాడా (వాటర్ చెస్ట్‌నట్.. నీటిలో పెరిగే ఒకరకమైన కాయలు) ఉత్పత్తులకు ప్రతిష్ఠాత్మక భౌగోళిక సూచిక (జీఐ) ట్యాగ్ లభించింది. చెన్నైలోని జీఐ రిజిస్ట్రీ ఈ గుర్తింపును మంజూరు చేసినట్లు ప్రభుత్వ అధికారులు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. దేశంలో బఠాణీ, సింఘాడా పంటలకు ఒకేసారి జీఐ ట్యాగ్ లభించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈ విజయంతో జబల్‌పూర్ దేశ వ్యవసాయ పటంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. జబల్‌పూర్‌కు చెందిన మైకల్‌సుత ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఈ రెండు వ్యవసాయ ఉత్పత్తులకు జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేసింది.

# జూలై 1న భారత్‌కు జపాన్ ప్రధాని

న్యూఢిల్లీ: భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు జపాన్ ప్రధాన సనాయే తకాయిచి జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్–జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి.

# ఫిలిప్పీన్స్‌లో మరో భారీ భూకంపం

**6.5 తీవ్రతతో ప్రకంపనలు**

మిండనావో: దక్షిణ ఫిలిప్పీన్స్‌లోని మిండనావో ప్రాంతంలో మరోసారి భారీ భూకంపం సంభవించింది. స్థానిక కాలమానం ప్రకారం, శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రతతో ఈ శక్తివంతమైన ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో భయాందోళనకు గురైన తీరప్రాంత ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి, ముందుజాగ్రత్త చర్యగా ఎత్తైన ప్రదేశాలకు పరుగులు తీశారు. అమెరికా జియోలాజికల్ సర్వే (యూఎస్‌జీఎస్), జర్మన్ రీసెర్చ్ సెంటర్ (జీఎఫ్‌జెడ్) నివేదికల ప్రకారం, దవావో రీజియన్‌లోని సారంగానికి 34 కిలోమీటర్ల దూరంలో, భూ అంతర్భాగంలో సుమారు 42 నుంచి 52 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూకంపం ధాటికి దవావో నగరంలోని భవనాలు దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ భూకంపం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. అధికారులు ప్రస్తుతానికి ఎలాంటి సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు.

# విదేశీ ప్రయాణాలకు 'ఈజీ కనెక్ట్'

న్యూఢిల్లీ: టైర్–2, టైర్–3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా 'ఈజీ కనెక్ట్' విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో... ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్–ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. ఉదాహరణకు, వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు.

# రూ.10కి చేరనున్న గుడ్డు!

**తెలంగాణలో సామాన్యుడి వంటగది బడ్జెట్‌పై అదనపు భారం పడింది. గత మూడు నెలలుగా నిరంతరంగా పెరుగుతున్న కోడిగుడ్డు ధరలు ప్రస్తుతం రికార్డు స్థాయికి చేరుకున్నాయి. రిటైల్ మార్కెట్లో ఒక్కో గుడ్డు ధర రూ.8 పలుకుతుండగా, సమీప భవిష్యత్తులో ఇది 10కి చేరే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.**



హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): ఈ ధరల పెరుగుదల సామాన్య ప్రజలతో పాటు ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం అమలుపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) గణాంకాల ప్రకారం, హైదరాబాద్‌లో జూన్ 20–26 మధ్య హోల్‌సేల్ ధర రూ.6.35గా నమోదైంది. ఈ నెల ప్రారంభంలో రూ.5.55గా ఉన్న ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. ఫలితంగా రిటైల్ వ్యాపారులు ప్రాంతాన్ని బట్టి రూ.6.80 నుంచి రూ.8 వరకు విక్రయిస్తున్నారు. ఈ ఏడాది వేసవి తీవ్రతకు రాష్ట్రంలోని పౌల్ట్రీ ఫారాల్లో సుమారు 10 శాతం మేర కోళ్లు మృతి చెందడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. దీనికి తోడు కోళ్ల దాణా, మందుల ఖర్చులు పెరగడం కూడా సరఫరాపై ప్రతికూల ప్రభావం చూపింది. ప్రస్తుతం ఒక్కో గుడ్డు ఉత్పత్తికి రైతుకు రూ.7 వరకు ఖర్చవుతుండగా, ఫాం గేట్ వద్ద మాత్రం రూ.6 మాత్రమే లభిస్తోందని జాతీయ ఉత్తర తెలంగాణ గుడ్ల సమన్వయ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు తెలిపారు. గతంలో పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఎదురైన నష్టాలను ప్రస్తుత ధరల పెరుగుదల కొంతమేర భర్తీ చేస్తోందని ఆయన వివరించారు. మరోవైపు, తాము రూ.6.50 చొప్పున కొనుగోలు చేసి, రవాణా తదితర ఖర్చులు పోను నామమాత్రపు లాభంతో రూ.7కి అమ్ముతున్నామని చిల్లర వర్తకులు చెబుతున్నారు. రాష్ట్రంలో రోజుకు సుమారు 4 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా, అందులో సగం స్థానికంగా వినియోగమవుతున్నాయి. ప్రస్తుత ధరల పెరుగుదల ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథక సరఫరాదారులపై కూడా తీవ్ర ఒత్తిడి పెంచుతోంది. వర్షాకాలం ప్రారంభమైతే పరిస్థితులు మెరుగుపడి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, అదే సమయంలో డిమాండ్ కూడా అధికమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమీప భవిష్యత్తులో ధరలు స్థిరంగా కొనసాగవచ్చు లేదా మరింత పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కాలేజీల్లో ప్రమాణాల సంగతి తేల్చండి

**ప్రైవేటు కాలేజీల్లో ఫీజుల వసూలుపై విజయశాంతి**



హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): తెలంగాణలోని ప్రైవేట్ కాళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూళ్లతో పాటు, కనీస విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించేలా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత విజయశాంతి డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆయా కళాశాలల్లో విద్యా నాణ్యత, ప్రమాణాల అమలుతో ముడిపెట్టాలని ఆమె సూచించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను విజయశాంతి స్వాగతించారు. అయితే, ప్రభుత్వ చెల్లింపులు, విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్ల కోసం ఆరాటపడే యాజమాన్యాలు, నాణ్యమైన విద్యను, కనీస వసతులను అందించడంలో విఫలమవుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "ఫీజులు వసూలు చేసే హక్కు ప్రైవేట్ యాజమాన్యాలకు ఉన్నప్పటికీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యతను కూడా వారు విధిగా నెరవేర్చాలి" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో విజిలెన్స్ కమిషన్ సమర్పించిన నివేదిక సైతం పలు ప్రైవేట్ కళాశాలల్లో సరైన వసతులు లేవని స్పష్టం చేసిన విషయాన్ని విజయశాంతి గుర్తుచేశారు. ఈ అంశాన్ని తాను ఇదివరకే శాసనమండలిలో సైతం ప్రస్తావించినట్లు ఆమె తెలిపారు. ప్రజాధనంతో చెల్లించే రీయింబర్స్‌మెంట్ నిధులు విద్యార్థుల భవిష్యత్తుకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వ నిబంధనలను పాటించని విద్యా సంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచానికి సమానత్వాన్ని నేర్పింది మనమే: సీజేఐ

న్యూఢిల్లీ: ఆధునిక ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనకు పునాదిగా భావించే 'మాగ్నా కార్టా' కన్నా శతాబ్దాల ముందే భారతదేశంలో సమానత్వ భావన పుట్టిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కౌటిల్యుడు రచించిన 'అర్థశాస్త్రం'లోనే దీని మూలాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన 14వ సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ న్యాయ ఫోరమ్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. 1215లో వచ్చిన మాగ్నా కార్టా.. రాజుతో సహా ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలనే విప్లవాత్మక సూత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందని చెబుతారని, కానీ అంతకంటే ముందే నాలుగో శతాబ్దంలోనే కౌటిల్యుడి అర్థశాస్త్రం సమానత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందని తాను వ్యక్తిగతంగా విశ్వసిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అర్థశాస్త్రాన్ని మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ప్రధాన సలహాదారుడైన కౌటిల్యుడు సంస్కృతంలో రచించారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. చట్టం సమానంగా అందుబాటులో ఉండటం అనేది కేవలం ఒక ప్రక్రియగా మిగిలిపోకూడదని, అది ప్రజలకు వాస్తవ హక్కులను అందించాలని స్పష్టం చేశారు. "చట్టపరమైన హామీలను వల్లెవేయడం కాదు.. భౌగోళిక, ఆర్థిక, సామాజిక అంతరాలను అధిగమించి వాటి ఫలాలను ప్రజలకు అందించడమే అసలైన సవాల్" అని ఆయన పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కూడా పౌరులందరికీ చట్టం ముందు సమానత్వం, గౌరవంగా జీవించే హక్కు వంటి అనేక ప్రాథమిక హక్కులను అందించిందని గుర్తుచేశారు. వలసవాదం, పేదరికం వంటి సమస్యల నుంచి బయటపడి అనేక దేశాలు ఇంకా తమ వ్యవస్థలను నిర్మించుకుంటున్నాయని అన్నారు.



# వెనిజువెలాలో 235కు మృతులు

కారకాస్: వెనిజువెలా శిథిలాల దిబ్బగా మారింది. బుధవారం సాయంత్రం సంభవించిన జంట భూకంపాల వల్ల ఆ దేశంలో మృతిచెందిన వారి సంఖ్య 235కు చేరుకున్నది. ఇక గాయపడ్డవారి సంఖ్య 4300 దాటింది. కారకాస్‌కు సమీపంలో ఉన్న కోస్టల్ నగరం లా గైరాలో ఇంకా ఆర్తనాదాలు వినిపిస్తున్నాయి. శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నారు. అనేక బిల్డింగ్‌లు నేలమట్టం కావడం వల్ల వేల సంఖ్యలో జనం నిరాశ్రయులయ్యారు. కొన్ని బిల్డింగ్‌లకు భద్రత కరువైంది. రెండు రోజులుగా జనం రోడ్డుపైనే నిద్ర పోయారు. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ దేశంలో ఎమర్జెన్సీ ప్రకటించారు. వెనిజువెలాకు సహాయం అందించేందుకు అనేక దేశాలు ప్రతిజ్ఞ చేశాయి. రెస్క్యూ ఆపరేషన్స్ కోసం అమెరికా నౌకలను, విమానాలను పంపిస్తున్నది. లా గైరా సిటీలో సుమారు 250 బిల్డింగ్‌లు నేలమట్టం అయినట్లు జార్జ్ రోడ్రిగ్రేజ్ తెలిపారు. ఓ పది అంతస్తుల హోటల్ పూర్తిగా ధ్వంసమైన విషయం తెలిసిందే.

# రాంగ్ రూట్ ప్రాణాలు తీసింది

**హైదరాబాద్ గచ్చిబౌలిలో ఘోర ప్రమాదం**

హైదరాబాద్, జూన్26 (ఈవార్తలు): గచ్చిబౌలిలో ఈ ఉదయం ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఏఎంబీ ఫ్లైఓవర్‌పై జరిగిన యాక్సిడెంట్‌లో ఇద్దరు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. రాంగ్ రూట్‌లో వస్తున్న స్కూటీని ఎదురుగా వచ్చిన బుల్లెట్ బైక్ బలంగా ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. వాళ్లను శ్రీకాంత్, విఠల్ పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన బుల్లెట్ బైక్ రైడర్ వినోద్‌ను స్థానికులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల ప్రకారం.. ఈ ఫ్లైఓవర్‌పై తరచూ వాహనాలు రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్నాయి. పోలీసుల పర్యవేక్షణ, కఠిన చర్యలు లేకపోవడం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. సరైన నియంత్రణ ఉంటే ఈ ప్రాణనష్టం తప్పించుకోవచ్చని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సాయికృష్ణ లాకప్‌డెత్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

న్యూఢిల్లీ: ఏపీకి చెందిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్‌పై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్ అయ్యింది. పోలీసుల అధికార దుర్వినియోగంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్‌కు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు జారీ చేసింది. వారంలోగా ఘటనపై యాక్షన్ టేకెన్ రిపోర్టు పంపాలని ఆదేశించింది సిట్ దర్యాప్తు వివరాలు, పోలీసులకు వ్యతిరేకంగా దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. పోలీసు స్టేషన్‌లో డిలీట్ చేసిన సీసీటీవీ ఫుటేజ్ రికవరీ చేయాలి. గాదె సాయి కృష్ణ అస్థికలను కనుగొనాలి. సాయికృష్ణ తల్లికి రక్షణ కల్పించాలి. ఈ ఘటనలో సాక్షులను కాపాడాలి. బాధితులకు ఇచ్చిన మధ్యంతర నష్టపరిహారం సహాయం వివరాలను అందజేయాలి" ఎన్‌హెచ్‌ఆర్‌సీ కోరింది. తదుపరి విచారణ వారం తర్వాత చేపడతామని ఎన్‌హెచ్‌ఆర్‌సీ తెలిపింది.

# పల్నాడులో హైదరాబాద్ వాసుల దుర్మరణం

పల్నాడు, జూన్ 26 (ఈవార్తలు: ఏపీలోని పల్నాడు జిల్లాలో శుక్రవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మాచర్ల సమీపంలోని నగరవనం వద్ద ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన తుఫాను వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద తీవ్రతకు వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. మృతులంతా హైదరాబాద్‌కు చెందిన వారిగా గుర్తించారు. కుటుంబ బంధువులు మరణించడంతో అంత్యక్రియలకు హాజరయ్యేందుకు ప్రకాశం జిల్లా పామూరుకు వెళ్తున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో తుఫాను వాహనంలో పది మందికి పైగానే ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుల్ని కదిరి వెంకటేశ్వర్లు ,కదిరి శారద, పిడుగు సత్యనారాయణ, పిడుగు అంజలిగా పోలీసులు ప్రకటించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# డెన్మార్క్‌లో ఆజాన్‌పై నిషేధం!

కోపెన్‌హాగన్: డెన్మార్క్ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా మసీదుల నుంచి బహిరంగంగా వినిపించే ఇస్లామిక్ ప్రార్థన పిలుపు 'అజాన్'పై నిషేధం విధించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించకుండా దీనిని ఏ విధంగా అమలు చేయవచ్చనే అంశంపై న్యాయ సమీక్షకు ఆదేశించింది. ఈ విషయాన్ని దేశ ఇమ్మిగ్రేషన్ మంత్రి మోర్టెన్ బోడ్స్కోవ్ వెల్లడించారు. "డెన్మార్క్ వీధుల్లో నడుస్తుంటే ఇస్లామాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్నామనే భావన కలగకూడదు" అని ఆయన వ్యాఖ్యానించారు. డెన్మార్క్ పైకప్పుల వెలుపల అజాన్ వినిపించాల్సిన అవసరం లేదని, ఇక్కడ దానికి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇస్లాం ప్రభావం పెరుగుతోందని ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ఆహార భద్రత నిబంధనలు సవరణ

**చిన్న, మధ్య తరహా వ్యాపారులపై తగ్గిన భారం**

న్యూఢిల్లీ: ఆహార వ్యాపార రంగంలో నిబంధనల భారాన్ని తగ్గించి, వ్యాపార సౌలభ్యాన్ని (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు–2011కు సవరణలు చేస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పుల ద్వారా ఆహార పదార్థాలను తయారు చేయని వ్యాపార సంస్థలకు కొన్ని ప్రధాన నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తాజా సవరణల ప్రకారం స్టాక్ రొటేషన్, రికార్డుల నిర్వహణ వంటి నిబంధనలు ఇకపై కేవలం ఆహార పదార్థాలను తయారు చేసే సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. గతంలో లైసెన్స్ పొందిన అన్ని ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా రికార్డులను నిర్వహించడంతో పాటు 'ఫస్ట్ ఇన్, ఫస్ట్ అవుట్' (ఎఫ్ఐఎఫ్ఓ) లేదా 'ఫస్ట్ ఎక్స్‌పైరీ, ఫస్ట్ అవుట్' (ఎఫ్ఈఎఫ్ఓ) పద్ధతులను పాటించాల్సి ఉండేది. అయితే, ఇప్పుడు రిటైలర్లు, ఇతర అనుబంధ వ్యాపార సంస్థలకు ఈ నిబంధనల నుంచి ఉపశమనం కల్పించారు. ఆహార భద్రత, నాణ్యత, ఉత్పత్తుల ట్రేసబిలిటీ వంటి అంశాల దృష్ట్యా తయారీ రంగంలో ఈ నిబంధనలు అత్యవసరం కాబట్టి, వాటికి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# రాముడి పేరుతో మోసం సహించను: యోగి

లక్నో: అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో నిందితులపై ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్ష చూపబోదని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పష్టం చేశారు. సనాతన ధర్మం, ప్రజల విశ్వాసంతో చెలగాటం ఆడేవారిపై జీరో టాలరెన్స్ విధానమే అమలు చేస్తామని హెచ్చరించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని యోగి తెలిపారు. "అయోధ్య విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ముందే చెప్పాం. విశ్వాసాన్ని దెబ్బతీసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా విపక్షాలపై కూడా యోగి తీవ్ర విమర్శలు చేశారు. "ఒకప్పుడు శ్రీరాముడు లేడని చెప్పినవారే ఇప్పుడు భక్తి గురించి మాట్లాడుతున్నారు. రామమందిర నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కోర్టుల్లో పోరాడినవాళ్లే ఇప్పుడు విశ్వాసం గురించి మాట్లాడటం విచిత్రం" అని వ్యాఖ్యానించారు.



తెలంగాణలో ఓటరు జాబితాను మరింత కచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను ధ్రువీకరిస్తారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల నమోదై ఉంటే వాటి సవరణ వంటి చర్యలు చేపట్టనున్నారు. రాబోయే ఎన్నికల నాటికి ఎలాంటి లోపాలు లేని ఓటరు జాబితాను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎన్నికల అధికారులు వెల్లడించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హులు లేదా నకిలీ నమోదులను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల పరిశీలన.. ప్రజల సహకారంతో కచ్చితమైన జాబితా

# సర్ మీ ఇంటికొస్తున్నారు!

## డూప్లికేట్ నమోదులను గుర్తించి సవరణ.. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు తెలిపే చాన్స్




### ప్రజలు చేయాల్సినవి

- బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు పూర్తి వివరాలు అందించాలి.
- అవసరమైన గుర్తింపు, నివాస ధ్రువీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలి.
- 18 సంవత్సరాలు నిండిన యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలి.
- చిరునామా మారిన వారు వెంటనే మార్పు కోసం దరఖాస్తు చేయాలి.
- ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించాలి.
- ఏవైనా తప్పులు ఉంటే నిర్ణీత గడువులో అభ్యంతరాలు దాఖలు చేయాలి.




### ముఖ్యాంశాలు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రారంభం.
- బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాల ధ్రువీకరణ.
- కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు.
- డూప్లికేట్ నమోదుల గుర్తింపు, సవరణ.
- 18 ఏళ్లు నిండిన ప్రతి అర్హుడు తప్పనిసరిగా నమోదు కావాలని సూచన.
- ప్రజల సహకారంతో లోపాలులేని ఓటరు జాబితా సిద్ధం చేయడమే లక్ష్యం.

### సర్ ద్వారా కలిగే ప్రయోజనాలు

- ప్రతి అర్హుడికి ఓటు హక్కు లభించే అవకాశం పెరుగుతుంది.
- నకిలీ ఓటర్ల నమోదుకు అడ్డుకట్ట పడుతుంది.
- మరణించిన వ్యక్తుల పేర్లు జాబితా నుంచి తొలగిపోతాయి.
- ఒకే వ్యక్తి పేరు బహుళ ప్రాంతాల్లో నమోదై ఉంటే సవరిస్తారు.
- ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.
- పారదర్శక ప్రజాస్వామ్య వ్యవస్థకు బలం చేకూరుతుంది.




### సర్ అంటే ఏమిటి?

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) అనేది ఎన్నికల సంఘం నిర్వహించే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం. సాధారణ వార్షిక సవరణల కంటే విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి వివరాలను పరిశీలించడం, అవసరమైన మార్పులు చేర్పులు చేయడం దీని ముఖ్య ఉద్దేశం. దీని ద్వారా కచ్చితమైన, తాజా ఓటరు జాబితా రూపొందుతుంది.

### ప్రజలు తప్పనిసరిగా సహకరించాలి

బీఎల్‌వోలు ఇంటికి వచ్చినప్పుడు కుటుంబ సభ్యుల వివరాలు, వయస్సు, చిరునామా, అవసరమైన పత్రాలు వంటి సమాచారాన్ని సక్రమంగా అందించాలని అధికారులు సూచించారు. తప్పు సమాచారం ఇవ్వడం లేదా వివరాలు దాచిపెట్టడం వల్ల భవిష్యత్తులో ఓటు హక్కు వినియోగంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహిస్తున్నందున, ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించిన తరువాతే నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల అధికారులు తెలిపారు. ప్రజలు సహకరిస్తే రాష్ట్రంలో అత్యంత కచ్చితమైన ఓటరు జాబితా సిద్ధమవుతుందని పేర్కొన్నారు.



### సర్వే షెడ్యూల్ - ముఖ్య దశలు

- జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం.
- సర్వే అనంతరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల.
- అభ్యంతరాలు, మార్పుల కోసం ప్రత్యేక గడువు కల్పింపు.
- పరిశీలన పూర్తయ్యాక తుది ఓటరు జాబితా ప్రకటింపు.




### గుర్తుంచుకోవాల్సినవి:

- 18 సంవత్సరాలు నిండితే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోండి.
- బీఎల్‌వోలకు అవసరమైన సహకారం అందించండి.
- సరైన సమాచారమే అందించండి.
- ముసాయిదా జాబితాలో మీ పేరు ఉందో లేదో తప్పకుండా పరిశీలించండి.
- ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కు.



- దూడం శ్రీశైలం, సీనియర్ జర్నలిస్టు, జగిత్యాల,
9133947176



# వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవీఆర్ కరాటే అకాడమి



హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ పర్యవేక్షణలో శుక్రవారం కాచిగూడ లోని జీవీఆర్ కరాటే అకాడమీ లో నిర్వహించిన కార్యక్రమంలో కరాటే విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించారు. కరాటే మాస్టర్ డాక్టర్ జివిఎస్ గోపాల్ రెడ్డి కరాటే విద్యార్థులైన భార్గవసాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియాలతో కలిసి ఈ రికార్డు చేశారు. 36 సెకండ్లలో 6 మంది విద్యార్థుల తలలపై ఉంచిన 26 యాపిల్స్ను చేతితో బ్రేక్ చేసి రికార్డు సృష్టించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో–ఆర్డినేటర్ బింగి నరేందర్ గౌడ్ రికార్డు చేసిన గోపాల్ రెడ్డి తో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్స్, మెడల్స్ ను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మహాలక్ష్మి రామన్ గౌడ్, కన్నె ఉమా రమేష్ యాదవ్, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, కోట్ల నిరంజన్ రెడ్డి, కరీమ్, అమృతరెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైత తదితరులు పాల్గొని రికార్డు గ్రహీతలు అభినందించి సత్కరించారు. జివిఆర్ కరాటే అకాడమీ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి తన అసాధారణ కరాటే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ.. ఆరుగురు విద్యార్థుల తలపై ఉంచిన 26 ఆపిల్స్ను కేవలం 36 సెకన్లలో హ్యాండ్ చాప్స్ ద్వారా బ్రేక్ చేసి సరికొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పారు. ఈ సందర్భంగా వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ఇండియా చీఫ్ కో–ఆర్డినేటర్ శ్రీ బింగి నరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సమాజానికి చైతన్యాన్ని కలిగించే సందేశంతో ఈ ప్రపంచ రికార్డును నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కేవలం 36 సెకన్లలో అత్యంత క్రమశిక్షణ, ఏకాగ్రత, భద్రతా ప్రమాణాలతో ఈ విన్యాసాన్ని విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డిని అభినందించారు. ప్రపంచ రికార్డులు కేవలం ప్రతిభను ప్రదర్శించడానికి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే సందేశాన్ని అందించేలా ఉండాలని, ఆ దిశగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్నారని కొనియాడారు. అలాగే ఈ రికార్డులో పాల్గొన్న భార్గవ సాయి, ప్రణీత్, నైతిక్ రెడ్డి, సంజన, తన్వి, చిన్మయి ప్రియ లను ప్రత్యేకంగా అభినందిస్తూ, వారి ధైర్యం, విశ్వాసం, క్రమశిక్షణ ఈ ప్రపంచ రికార్డు విజయానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి, పాల్గొన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు జివిఆర్ కరాటే అకాడమీ బృందానికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ తరపున శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ప్రపంచ రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్, మాజీ కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, వివేక్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎ. కృష్ణా రెడ్డి, నేతాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు మరియు డైరెక్టర్ కోట్ల నిరంజన్ రెడ్డి, జివిఆర్ కరాటే అకాడమీ బ్లాక్ బెల్ట్స్ కరీమ్, అమృత రెడ్డి, గణ సంతోషిణి రెడ్డి, రాజు, సుధాకర్, అనఘ, షైనీ, ద్వైతతో పాటు అకాడమీ విద్యార్థులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ జి.ఎస్. గోపాల్ రెడ్డి మరియు విద్యార్థులను అభినందించారు. ఈ ప్రపంచ రికార్డు ద్వారా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి క్రీడలు, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని జివిఆర్ కరాటే అకాడమీ పిలుపునిచ్చింది.



## అండర్-19 బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మణికొండలోని అదిరా బ్యాడ్మింటన్ అకాడమీ వేదికగా జూన్ 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న యోనెక్స్––సన్‌రైజ్ 12వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ (అండర్–19) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్––2026 శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైదరాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కానూరు వంశీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, "క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం. విజయంతో గర్వపడకుండా వినయంతో ఉండాలి. ఓటమిని అపజయంగా కాకుండా విజయానికి పునాదిగా భావించి మరింత కృషి చేయాలి. క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, పట్టుదల ప్రతి క్రీడాకారుడిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయి. ప్రతి పోటీ ఒక కొత్త అనుభవాన్ని, కొత్త పాఠాన్ని నేర్పుతుంది. రాష్ట్రానికి, దేశానికి కీర్తి తీసుకొచ్చే క్రీడాకారులుగా ఎదగాలని యువత లక్ష్యంగా పెట్టుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో అదిరా బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకులు శిఖరం శ్రీనివాస్, శిఖరం సౌమ్య, బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ ఎల్. రవికుమార్, అబ్జర్వర్ పీ. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## కంచి డీమ్డ్ యూనివర్సిటీలో ప్రవేశాలు

**జగిత్యాలలో అవగాహన కార్యక్రమం**

జగిత్యాల, జూన్ 26 (ఈవార్తలు): ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు, ఫీజు రాయితీలపై కంచి డీమ్డ్ యూనివర్సిటీ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం జగిత్యాల బ్రాహ్మణ వీధి శ్రీరామ మందిరంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ జి. శ్రీనివాసు, ప్రొఫెసర్ వెంకటరమణ మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇంజనీరింగ్‌తో పాటు ఇతర కోర్సుల్లోనూ ఆధునిక సబ్జెక్టులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అన్ని ఇంజనీరింగ్ విభాగాలకు ఏఐ అనుసంధానం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ మార్కుల ఆధారంగా ప్రవేశాలు, ఫీజు రాయితీలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమం అనంతరం కొంతమంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## చెక్ పవర్ రద్దు చేయొద్దు

**మంత్రి అడ్లూరికి ఉపసర్పంచుల వినతి**



బీర్పూర్, జూన్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు దగ్గుల వీరేశం ఆధ్వర్యంలో మండలంలోని ఉపసర్పంచులు శుక్రవారం రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి అందజేశారు. ముఖ్యంగా ఉపసర్పంచుల చెక్ పవర్ రద్దు చేయవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## బీజేపీ ఎస్సీసెల్ జగిత్యాల అధ్యక్షునిగా నారపాక



జగిత్యాల, జూన్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన నారపాక అశోక్‌ను జగిత్యాల జిల్లా బీజేపీ ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నారపాక అశోక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి బాబు, జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. భోగ శ్రావణి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి పాటు పడతానని ఆయన పేర్కొన్నారు. ఎస్సీ సమాజాన్ని భారతీయ జనతా పార్టీతో మరింత అనుబంధంగా తీర్చిదిద్దేందుకు అందరి మార్గదర్శకత్వంలో పనిచేస్తానని స్పష్టం చేశారు.

## దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

**మంత్రి వివేక్ వెంకట్ స్వామికి వినతి**



హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ నూర్ బాషా రాష్ట్ర కన్వీనర్, మాజీ ఎంపీపీ (ఎండపల్లి) ఎండీ బసీర్ ఆధ్వర్యంలో దూదేకుల రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమొద్దీన్ తదితరులు లేబర్, మైనింగ్ శాఖ మంత్రి జీ. వివేక్ వెంకట్ స్వామిని శుక్రవారం సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా జీవో నెంబర్ 125 ప్రకారం దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు అంశంపై మంత్రికి వివరించారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కార్పొరేషన్ అవసరాన్ని నేతలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు అహ్మద్ హుస్సేన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ రజాక్, రాష్ట్ర సెక్రటరీ మహమ్మద్ సయ్యద్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సమద్, రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ అఫ్సరా, రాష్ట్ర కోశాధికారి ఎండీ యూసుఫ్, యూత్ అధ్యక్షుడు అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# పానం పోతున్నా పీఎఫ్ పైసలియ్యరా?

**నాలుగేళ్లుగా పీఎఫ్ చెల్లించలే.. రెండ్నెల్లుగా జీతమివ్వలే**

**పీఎఫ్ బకాయిల కోసం శానిటేషన్ వర్కర్ ఆత్మహత్యాయత్నం**

**ప్రభుత్వంపై ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ తీవ్ర ఆగ్రహం**



వికారాబాద్/హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): వికారాబాద్ జిల్లా తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ హన్మమ్మ పీఎఫ్ బకాయిలు, వేతనాల చెల్లింపులో జాప్యం కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తీవ్ర ఆందోళన కలిగించిందని తెలంగాణ రాష్ట్ర ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ డిమాండ్ చేశారు. సంఘం విడుదల చేసిన ప్రకటనలో, హన్మమ్మకు నాలుగు సంవత్సరాలుగా రావాల్సిన పీఎఫ్ బకాయిలు, రెండు నెలల వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొంది. ఈ సంఘటన ఒక్క ఉద్యోగికి జరిగిన అన్యాయం మాత్రమే కాదని, ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న వేలాది మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇది నిదర్శనమని అభిప్రాయపడింది. ఉద్యోగుల వేతనాల నుంచి ప్రతి నెలా ఈపీఎఫ్ పేరుతో కోతలు విధిస్తున్నప్పటికీ, సంబంధిత మొత్తాలను ఖాతాల్లో జమ చేయడం లేదని సంఘం ఆరోపించింది. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరింది. హన్మమ్మకు ప్రభుత్వం పూర్తిస్థాయి ఉచిత వైద్యం అందించడంతో పాటు ప్రత్యేక ఆర్థిక సాయం ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంఘం డిమాండ్ చేసింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పీఎఫ్, ఈఎస్ఐ, వేతన బకాయిలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, పెండింగ్ చెల్లింపులను వెంటనే పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రతి నెలా పీఎఫ్ జమ వివరాలను ఉద్యోగులకు అందుబాటులో ఉంచే పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని ఎస్పీఎస్ రాష్ట్ర కమిటీ కోరింది. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎస్పీఎస్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ హెచ్చరించింది.



## రోళ్లవాగు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి**

బీర్పూర్, జూన్ 26 (ఈవార్తలు): రోళ్లవాగు అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగును ఆయనతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వాగు పరిసర ప్రాంతాల్లో నీటి ప్రవాహం, వాగు సామర్థ్యం, వర్షాకాల పరిస్థితులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వాగు గట్టు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో తక్షణ మరమ్మతులు చేపట్టాలని, వరద నీరు గ్రామాల్లోకి ప్రవేశించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వాగులో మట్టి, చెత్త, పొదలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ రోళ్లవాగు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రజల భద్రత, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పద్మశాలి ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి: ఈగ వెంకటేశ్వర్లు



హైదరాబాద్, జూన్ 26 (ఈవార్తలు): తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్‌బీ నగర్‌లోని స్వకులశాలి సమాజ భవనంలో రాష్ట్ర స్థాయి పద్మశాలి ఉద్యోగుల సదస్సు ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగులు పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలోని పేద విద్యార్థులకు విద్యా పరంగా, ఆర్థిక పరంగా చేయూత అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు సంఘం అభివృద్ధికి చేసిన సేవలను ఆయన అభినందించారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ పద్మశాలి సభ అతిథిగా ఎంగండ్ల రాహుల్ కుమార్, విశిష్ట అతిథిగా బొద్దుల గంగయ్య హాజరయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, ఆర్గనైజేషనల్ కార్యదర్శి సిరందాస్ యాదగిరేందర్, కోశాధికారి ఆలే బాలకృష్ణతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, జిల్లా నాయకులు, పద్మశాలి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు కూడా హాజరై సదస్సు విజయవంతానికి సహకరించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి సుమారు 500 మంది ఉద్యోగులు ఈ సదస్సులో పాల్గొని సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.



## కేటీఆర్‌తో దావ వసంత మర్యాదపూర్వక భేటీ

**పలు జగిత్యాల అభివృద్ధి అంశాలపై చర్చ**

జగిత్యాల, జూన్ 26 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పుష్పగుచ్ఛం అందజేసి కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురి మధ్య జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై సవివరంగా చర్చ జరిగినట్లు సమాచారం. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై దృష్టి సారిస్తూ భవిష్యత్ ప్రణాళికలపై కూడా ప్రాథమికంగా చర్చ జరిగినట్లు తెలిసింది. అలాగే స్థానిక సంస్థల పనితీరు, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవల అందుబాటు విషయాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాలు, జిల్లాలో రాజకీయ పరిస్థితులు, సంస్థాగత బలోపేతంపై కూడా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## వైద్య సేవలను బలోపేతం చేస్తాం

**ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తాం**

**బీర్‌పూర్ పీహెచ్‌సీ ప్రారంభోత్సవంలో అడ్లూరి**

బీర్పూర్, జూన్ 26 (ఈవార్తలు): ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండల కేంద్రంలో నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. జగిత్యాల జిల్లాను మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు మెడికల్ కళాశాల, 450 పడకల ఆసుపత్రి, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏఎన్ఎం, ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పీహెచ్‌సీల్లో అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని చెప్పారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పనులు పూర్తయ్యాయని, పూర్తి స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.





## డ్రగ్స్‌తో యువత భవిష్యత్తు నాశనం

మెట్‌పల్లి, జూన్ 26 (ఈవార్తలు): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయని మెట్‌పల్లి సీఐ సురేష్ బాబు ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి రహిత సమాజ నిర్మాణానికి పోలీసులు, తల్లిదండ్రులు, ప్రజలు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను తల్లిదండ్రులు గమనించాలని, వారు ఎవరితో తిరుగుతున్నారో తెలుసుకోవాలని సూచించారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయి, డ్రగ్స్ విక్రయం, రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే డయల్–100కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. యువత జీవితాలతో ఆడుకునే గంజాయి, డ్రగ్స్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వయ్యారి చిత్రం



దీక్షా రావు




# నెట్‌ఫ్లిక్స్‌లో రితేశ్ 'రాజా శివాజీ'

మరాఠీ చిత్ర పరిశ్రమలో భారీ వసూళ్లతో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చారిత్రక చిత్రం 'రాజా శివాజీ' ఓటీటీ ప్రియుల ముందుకు వచ్చేసింది. థియేటర్లలో రూ.110 కోట్లకు పైగా కలెక్షన్లతో సంచలనం సృష్టించిన ఈ సినిమా, ఇప్పుడు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో డిజిటల్ స్ట్రీమింగ్ అవుతోంది. శుక్రవారం ఈ చిత్రం నెట్‌ఫ్లిక్స్‌లో మరాఠీ, హిందీ భాషల్లో అందుబాటులోకి వచ్చింది. మరాఠీ, బాలీవుడ్ స్టార్ హీరో రితేష్ దేశ్‌ముఖ్ ఛత్రపతి శివాజీ మహారాజ్ పాత్రలో నటించడమే కాకుండా, ఈ చిత్రానికి ఆయనే స్వయంగా దర్శకత్వం వహించారు. రితేష్ భార్య జెనీలియా దేశ్‌ముఖ్ సాయిబాయి పాత్రలో కనిపించడంతో పాటు ఈ సినిమాను నిర్మించారు. వీరితో పాటు సంజయ్ దత్ అఫ్జల్ ఖాన్‌గా, అభిషేక్ బచ్చన్ సంభాజీ భోసలేగా, విద్యాబాలన్, ఫర్దీన్ ఖాన్ వంటి స్టార్ నటులు ముఖ్య పాత్రల్లో కనిపించారు. సల్మాన్ ఖాన్ కూడా ఒక ప్రత్యేక అతిథి పాత్రలో మెరిశారు. గ్రాండ్ విజువల్స్, పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌లతో ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితాన్ని తెరపై ఆవిష్కరించిన ఈ చిత్రం థియేటర్ల తర్వాత ఇప్పుడు ఓటీటీలోనూ సందడి చేస్తోంది.

# 4 నెలల్లో వారణాసి షూట్ కంప్లీట్: రాజమౌళి

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి'. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోన్న ఈ సినిమాకు సంబంధించి తాజాగా బిగ్ అప్డేట్ ఇచ్చాడు డైరెక్టర్ రాజమౌళి. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్‌నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన.. "వారణాసి' సినిమా షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా కంప్లీట్ అవుతుంది. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే పూర్తి అయింది. ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నాం. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని మేము ముందుగానే భావించాము. అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదు. సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశాము. 'అనామార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించాము. దీని కోసం మొదట్లో కొంచెం ఇబ్బంది పడ్డా తర్వాత ఈజీగా సాగింది' అంటూ రాజమౌళి చేసిన కామెంట్స్‌తో సినిమాపై హైప్ పెరిగింది.




# నరకం చూశా: కృతి సనన్

కృతి సనన్ ఇటీవల 'కాక్‌టెయిల్-2'తో బాలీవుడ్‌లో భారీ హిట్ సాధించింది. ప్రస్తుతం తెలుగు సినిమా పరిశ్రమ నుంచి బంపర్ ఆఫర్ అందుకుంది. విజయ్ దేవరకొండ, శౌర్యవ్‌తో కలిసి పాన్ ఇండియా స్థాయి చిత్రంలో కీలక పాత్రలో నటించనుందనే వార్త హల్‌చల్ చేస్తోంది. మరోవైపు, ఓ ఇంటర్వ్యూలో కృతి తన 12 ఏళ్ల సినిమా ప్రయాణం గురించి మాట్లాడుతూ ఎమోషనల్ అయ్యింది. "ప్రారంభంలో చాలా కష్టాలు పడ్డాను. మోడలింగ్ రోజుల్లో నా మొదటి ఫొటో షూట్, మొదటి ర్యాంప్ వాక్ రెండూ పూర్తిగా ఫ్లాప్ అయ్యాయి. ఇంటికి వెళ్లి ఏడ్చాను. కానీ ఆపకుండా మళ్లీ ఆడిషన్లు చేశాను. ఆ పట్టుదలే నన్ను ఇక్కడి వరకు తీసుకొచ్చింది" అని గుర్తు చేసుకుంది. అంతేకాదు, బాలీవుడ్‌లోని నెపోటిజం పైనా కృతి తీవ్రంగా స్పందించింది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్ లాంటి స్టార్ కిడ్స్ లో టాలెంట్ ఉందని, కష్టపడి నిరూపించుకున్నారని చెప్పిన కృతి... టాలెంట్ లేని కొందరు కేవలం ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ కారణంగా 8-9 ఏళ్ల పాటు వరుసగా అవకాశాలు పొందడం అన్యాయమని మండిపడింది. బ్యాక్‌గ్రౌండ్ లేని నటీనటులు మొదటి 2-3 ఏళ్లలోనే హిట్‌లు కొట్టకపోతే ఇండస్ట్రీ వారిని పక్కకు నెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.






# అక్టోబర్ 16న జైలర్ 2 రిలీజ్!

'జైలర్ 2' విడుదల తేదీపై తాజాగా ఆసక్తికరమైన సమాచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రాన్ని అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. 'జైలర్' చిత్రానికి సంగీతంతో ప్రాణం పోసిన అనిరుధ్ రవిచందర్ ఈ సీక్వెల్‌కూ సంగీతం అందిస్తున్నారు. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని అభిమానులు భావిస్తున్నారు. ఇక ఈ భారీ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. మొదటి భాగంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ వంటి స్టార్ నటులు ప్రత్యేక పాత్రల్లో కనిపించి ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే.

# రజనీ 173లో మీనాక్షి చౌదరి

త్వరలో సెట్స్ పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న రజనీకాంత్ 'ధర్మన్'కు సంబంధించి తాజాగా మరో అప్డేట్ కోలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తుంది. ఈ చిత్రంలో ఇప్పటికే సీనియర్ నటి సిమ్రాన్, యంగ్ బ్యూటీ రాశి ఖన్నా భాగం అయినట్లు తెలుస్తుండగా.. తాజాగా మీనాక్షి చౌదరి కూడా ఈ ప్రాజెక్టులో భాగం అయిందని సమాచారం. ప్రస్తుతం డైరక్టర్ అశ్వత్ మారిముత్తు తమిళ స్టార్ శింబుతో 'ఎస్‌టీఆర్51' కోసం వర్క్ చేస్తున్నాడు. ఇందులో మీనాక్షి చౌదరిని హీరోయిన్‌గా లాక్ చెయ్యగా.. ఇప్పుడు రాబోయే తలైవా 173లో కూడా ఎంపిక చేశారట. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతుండగా.. అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది.





# సమంత గర్భవతి నాకే తెలుసు: నందినీ రెడ్డి

స్టార్ హీరోయిన్ సమంత, డైరెక్టర్ నందిని రెడ్డి కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ఎంతటి క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. 'జబర్దస్త్', 'ఓ బేబీ' సినిమాల తర్వాత వీరిద్దరి కాంబోలో వచ్చిన 'మా ఇంటి బంగారం సినిమా' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూశారు. ఆ ఎదురు చూపులకు తగ్గట్టుగానే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి పాజిటివ్ టాక్ తో దూసుకుపోతోంది. తాజాగా ఓ పాడ్‌కాస్ట్ షోలో పాల్గొన్న నందిని రెడ్డి.. సమంత ప్రెగ్నెన్సీ గురించి ఆసక్తికరమైన విషయాలు బయట పెట్టారు. ఎన్టీవీ పాడ్‌కాస్ట్ షోలో నందిని రెడ్డి మాట్లాడుతూ... సినిమా షూటింగ్ సమయంలో జరిగిన సీక్రెట్‌ను షేర్ చేసుకున్నారు. "మా ఇంటి బంగారం షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సమయంలోనే.. సమంత గర్భవతి అయిందనే విషయం తెలిసింది.



# బాహుబలి 3 వస్తోంది..?

'బాహుబలి 3'పై మళ్లీ చర్చ మొదలైంది. తాజాగా విడుదలైన 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' డాక్యుమెంటరీలో ప్రభాస్, రానా దగ్గుబాటి, అనుష్క శెట్టి చేసిన వ్యాఖ్యలు, ఎక్స్‌ప్రెషన్స్ మూడో భాగం రానుందనే సంకేతాలుగా అభిమానులు భావిస్తున్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన 'బాహుబలి: ది టార్చ్‌బేరర్' డాక్యుమెంటరీలో రానా దగ్గుబాటి మాట్లాడుతూ "ప్రపంచం ఇంకా సిద్ధంగా లేకపోవచ్చు.. కానీ బాహుబలి.." అని చెప్పగా, వెంటనే ప్రభాస్ మూడు వేళ్లు చూపిస్తూ చిరునవ్వు చిందించాడు. పక్కనే ఉన్న అనుష్క శెట్టి కూడా నవ్వడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చివర్లో 'అండ్ ది లెగసీ కంటిన్యూస్' అనే సందేశం కనిపించడం మరింత ఆసక్తిని పెంచింది. ఈ క్లిప్‌ను చూసిన అభిమానులు 'బాహుబలి 3 అధికారికంగా వస్తోంది' అంటూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. అయితే దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి గానీ, చిత్ర బృందం గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.





# భారత్‌కు భంగపాటు

## తొలి టీ20లో చిత్తు.. చరిత్ర సృష్టించిన ఐర్లాండ్

సంచలనాలకు నెలవైన టీ20ల్లో పెద్ద జట్టైన భారత్‌కు ఐర్లాండ్ (×తీవశ్రీఖఅ)ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల సిరీస్ తొలి పోరులో టీమిండియాను 34 పరుగుల తేడాతో ఓడించింది. 183 పరుగుల ఛేదనలో హిట్టర్లతో నిండిన భారత జట్టు అలవోకగా గెలుస్తుందనుకుంటే.. ఐరిష్ బౌలర్లు గొప్పగా కట్టడి చేశారు. మాథ్యూ హెలార్డ్(3-28)తో మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. అభిషేక్ శర్మ(50),శివం దూబే(25) కాసేప పోరాడాడు. ఫలితంగా సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది ఆతిథ్య జట్టు. టీ20 వరల్డ్‌కప్‌ను మూడుసార్లు ముద్దాడిన భారత్‌ను చిన్న జట్టైన ఐర్లాండ్ ఓడించింది. స్వదేశంలో బ్యాటుతో, బంతితో, ఫీల్డింగ్‌లోనూ అద్భుతంగా రాణించిన ఐరిష్ టీమ్ సంచలన విజయంతో టీమిండియాకు షాకిచ్చింది. తొలుత ఆడిన ఐర్లాండ్. 183 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రికార్డు వీరులైన భారత బ్యాటర్ల ముందు ఈ లక్ష్యం ఏం నిలుస్తుంది అనుకున్న వారి అంచనాలు తప్పని ఐర్లాండ్ నిరూపించింది. పొట్టి వరల్డ్‌కప్‌లో ఇరగదీసిన ఓపెనర్ సంజూ శాంసన్(5) బంతిని వికెట్ల మీదకు ఆడుకోగా.. ఇషాన్ కిషన్(1).. శ్రేయస్ అయ్యర్(3) ఇలా వచ్చి అలా వెళ్లారు. ఐరిష్ బౌలర్లు ఒత్తిడి పెంచే ప్రయత్నాన్ని అభిషేక్ శర్మ(50) అర్ధ శతకంతో నీరుగార్చాడు. కానీ బౌన్సర్లు, షార్ట్ పిచ్ బంతులతో టీమిండియా హిట్లర్లకు కళ్లెం వేశారు. సుందర్(9), తిలక్ వర్మ(19) సైతం నిలబడలేదు. చూస్తుండగానే ఐదు వికెట్లు పడడంతో శివం దూబే(25), అక్షర్ పటేల్(15) గెలిపించే ప్రయత్నం చేశారు. ఏడో వికెట్‌కు 35 రన్స్ చేసిన దూబేను మూంద్రా రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. డెలానీ ఓవర్లో సిక్సర్ కొట్టే క్రమంలో టెక్టర్ చేతికి చిక్కాడు అక్షర్. దాంతో.. టీమిండియా ఓటమి ఖాయమైంది. సిక్సర్‌తో ఆశలు రేపిన హర్షిత్ రానా(8) బౌండరీ వద్ద దొరికగా.. 19వ ఓవర్ చివరి బంతికి అర్ష్‌దీప్ సైతం ఔటయ్యాడు. భారత్ 148కే ఆలౌటవ్వగా.. 34 రన్స్ తేడాతో ఐర్లాండ్ గెలుపొందింది. భారత బౌలర్లు పంజా విసిరినా ఐర్లాండ్ భారీ స్కోర్ కొట్టింది. టాస్ ఓడిన జట్టుకు శుభారంభమివ్వాలనుకున్న ఓపెనర్ రాస్ అడైర్(12)ను ఔట్ చేసి హర్షిత్ రానా(3-24) తొలి వికెట్ అందివ్వగా.. హ్యారీ టెక్టర్(0)ను అర్ష్‌దీప్ సింగ్(2-28) పెవిలియన్ పంపాడు. తర్వాతి ఓవర్లో టిమ్ టెక్టర్(17)ను రానా డగౌట్ చేర్చగా 30 పరుగులకే మూడు వికెట్లు పడ్డాయి. ఆ దశలో ఆచితూచి ఆడాలనుకున్న బెంజమిన్ కాలిట్జ్(15)ను దూబే బోల్తా కొట్టించాడు. కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ లొర్కాన్ టక్నర్(50), గరెత్ డెలానీ(49)లు ఆదుకున్నారు. టపటపా నాలుగు వికెట్లు పడిన దశలో టక్నర్, డెలానీ నిలబడ్డారు. మరో వికెట్ పడకుండా.. రన్‌రేటు తగ్గకుండా స్కోర్ బోర్డును నడిపించారిద్దరూ. దూబే ఓవర్లో ఫోర్, డబుల్స్‌లో ఐరిష్ సారథి అర్ధ శతకం సాధించాడు. కానీ హర్షిత్ ఓవర్లో టక్నర్.. తిలక్ వర్మ చేతికి చిక్కడంతో 115 వద్ద ఐదో వికెట్ పడింది. డెత్ ఓవర్లలో గేర్ మార్చిన గెలానీ బౌండరీలు రాబట్టగా.. ఐర్లాండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేయగలిగింది.

## కరీంనగర్‌పై ఖమ్మం ఏసెస్ గెలుపు

టీజీ20 లీగ్‌లో మరో ఉత్కంఠభరిత పోరుకు వేదికైంది. శుక్రవారం కరీంనగర్ డైమండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ 8 పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది. ఆద్యంతం థ్రిల్లర్‌ను తలపించిన మ్యాచ్‌లో 214 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కరీంనగర్ డైమండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. ఓపెనర్ సాత్విక్ రెడ్డి (63) టాప్ స్కోరర్‌గా నిలవగా, చివర్లో శుభమ్ శర్మ (54 నాటౌట్) ఆఖరి వరకు నిలిచినప్పటికీ గెలిపించలేకపోయాడు. ఖమ్మం ఏసెస్ బౌలర్లలో కెప్టెన్ సీవీ మిలింద్ 4 వికెట్లతో చెలరేగగా, సాహేంద్ర మల్లు రెండు వికెట్లు తీయగా, వాఫీ కచ్చీ, వేద్ రెడ్డి చెరొక వికెట్ తీశారు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన అన్విత ఖమ్మం ఏసెస్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 213 పరుగుల భారీ స్కోరు చేసింది.

## నల్లగొండ ఘన విజయం

ఉప్పల్ వేదికగా టీజీ20 లీగ్ మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్‌ను నల్గొండ నైట్స్ చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌లో నల్గొండ 259/5 స్కోరు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో వరంగల్ 14 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. దీంతో వరంగల్‌పై 91 పరుగుల తేడాతో నల్గొండ ఘన విజయం సాధించింది. కెప్టెన్ అమన్ రావు (46),



మురుగన్ అభిషేక్ (44), భవేశ్ సేఠ్ (22) దూకుడుగా ఆడారు. అయితే, మిగతా బ్యాటర్లలో హర్షిత్ చౌధరి (10), మణి కిరణ్ (16), అసిఫ్ (5), శౌనక్ (4), ముదాస్సర్ (5), పల్లెపాటి క్రాంతి (5) విఫలమయ్యారు. టాస్ ఓడిన నల్గొండ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (81: 34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), నితీశ్ రెడ్డి (81: 41 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ రాహుల్ బుద్ధి (31: 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అర్ఫాజ్ అహ్మద్ (33: 14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. ఆఖర్లో దివేశ్ సింగ్ ( 18లి) వేగంగా పరుగులు రాబట్టాడు. వరంగల్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 2.. ముదాస్సర్, శౌనక్ చెరో వికెట్ తీశారు.





# నాకౌట్‌కు ఈక్వెడార్

## దేశమంతా సెలవు



**ఫిఫా వరల్డ్‌కప్‌లో లీగ్ దశ దాటడమే గగనం. అలాంటిది నాలుగుసార్లు ఛాంపియన్‌ను ఓడించి నాకౌట్‌కు దూసుకెళ్తే ఆ కిక్కే వేరబ్బా. ఇప్పుడు ఈక్వెడార్ జట్టు.. ఆ దేశ ప్రజలు అదే కిక్కులో మునిగితేలుతున్నారు.**

జర్మనీకి షాకిచ్చిన ఈక్వెడార్ నాకౌట్ బెర్తు పట్టేయడం ఆ దేశాన్ని సంబురాల్లో ముంచెత్తింది. తమ జట్టు అద్భుతం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన అధ్యక్షుడు డానియెల్ నొబోవా అజిన్ శుక్రవారం దేశమంతా సెలవు దినం ప్రకటించారు. ఆటగాళ్లు, కోచ్‌ను అభినందించిన ఆయన.. తమ జట్టు విజయాన్ని అభిమానులు సెలబ్రేట్ చేసుకోవడానికి వీలుగా హాలి డే డిక్లేర్ చేశారు.

సాకర్ వరల్డ్‌కప్‌లో నాకౌట్‌లో అడుగుపెట్టడం చిన్న విషయమేమీ కాదు. మేటి జట్లను ఓడిస్తేగానీ లీగ్ దశ దాటటడం సాధ్యమవ్వదు. ఫిఫా వరల్డ్‌కప్‌లో మెరుగైన ప్రదర్శన చేసే ఈక్వెడార్ ఈసారి అతిపెద్ద సంచలనం నమోదు చేసింది. గతంలో నాలుగుసార్లు ఛాంపియన్ జర్మనీపై 2-1తో జయభేరి మోగించి నాకౌట్ బెర్తు సాధించింది. దాంతో, ఈక్వెడార్ అధ్యక్షుడు డానియెల్ నొబోవా అజిన్ ఆనందం పట్టలేకపోయారు. తమ జట్టు విజయాన్ని కీర్తించిన ఆయన.. దేశమంతా సెలవు ప్రకటించారు. 'ఈక్వెడార్ ఆటగాళ్లు, కోచ్‌కు ధన్యవాదాలు. విమర్శలు, అవమానాలు, కఠిన పరిస్థితులు ఎదురైనప్పటికీ మీరు గొప్పగా రాణించి దేశాన్ని సంబురాల్లో ముంచెత్తారు. రేపు శుక్రవారం దేశమంతా సెలవు ప్రకటిస్తున్నా. ఈక్వెడార్ జిందాబాద్' అని ఎక్స్ పోస్ట్‌లో డానియల్ పేర్కొన్నారు. కెనడా, మెక్సికో, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్‌ను గ్రూప్ ఈలోని ఈక్వెడార్ ఓటమితో ఆరంభించింది. తొలి పోరులో ఐవరీకోస్ట్ చేతిలో 0-1తో ఓడిన ఆ జట్టు.. కురకావోతో రెండో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. చావోరేవో పోరులో గురువారం జర్మనీపై ఈక్వెడార్ ఆటగాళ్లు గొప్ప ప్రదర్శన చేశారు. తొలుత జర్మనీ ఆటగాడు సేన్ రెండో నిమిషంలోనే గోల్ చేసి ఆధిక్యాన్ని అందించాడు. కాసేపటికే ఈక్వెడార్ ప్లేయర్ నీల్సన్ ఆంగులో 9వ నిమిషంలో గోల్ చేయగా స్కోర్ సమం అయింది. రెండో అర్ధ భాగంలో పెనాల్టీ లభించినా జర్మనీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. 77వ నిమిషంలో ఈక్వెడార్ ఆటగాడు గొంజాలెజ్ ప్లాటా గోల్‌తో 2-1తో అదిరే విజయాన్ని అందించాడు.



# అమెరికాకు ఝలక్.. టర్కీ విన్

ఫిఫా వరల్డ్‌కప్‌లో టర్కీ తొలి విజయాన్ని నమోదు చేసింది. వాస్తవానికి టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన ఆ జట్టు .. లాస్ ఏంజిల్స్ స్టేడియంలో హోస్ట్ అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో 3-2 గోల్స్ తేడాతో నెగ్గింది. గ్రూప్ డీ మ్యాచ్‌లో మొత్తం అయిదు గోల్స్ నమోదు అయ్యాయి. ఈ మ్యాచ్‌లో అమెరికా ఓడినా.. ఆ గ్రూపులో మాత్రం ఆ దేశమే అగ్రస్థానంలో ఉన్నది. ఆట ప్రారంభమైన మూడు నిమిషాలకే అమెరికా ప్లేయర్ ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టాడు. డీప్ కార్నర్ నుంచి సెబాస్టియన్ అందించిన పాస్‌ను లెఫ్ట్ ఫూట్‌తో ట్రస్టీ గోల్‌గా మలిచాడు. టోర్నీ నుంచి ఎలిమినేట్ అయినా.. అమెరికాతో మ్యాచ్‌లో మాత్రం టర్కీ పట్టుదలతో ఆడింది. ఇక టర్కీ ప్లేయర్ గులేర్ 10వ నిమిషంలో ఆ జట్టుకు తొలి గోల్ అందించాడు. అరగంట ఆట ముగిశాక.. టర్కీ ప్లేయర్ బారిస్ యిల్మాజ్ మరో గోల్ చేశ్శాడు. దీంతో టర్కీ లీడింగ్‌లోకి వెళ్లింది. రెండో హాఫ్ 49వ నిమిషంలో అమెరికా ప్లేయర్ బెర్‌హాల్టర్ గోల్ చేసి ప్రేక్షకుల్లో ఉత్కంఠ రేపాడు. దాదాపు ఆట ముగిసే సమయం వరకు రెండు జట్లు 2-2 గోల్స్ తేడాతో సమంగా పోరాడాయి. కానీ 98వ నిమిషంలో టర్కీ ప్లేయర్ అందర్నీ స్టన్ చేశాడు. కాన్ అయాన్ గోల్ చేయడంతో కీలకమైన మూడు పాయింట్లు టర్కీ ఖాతాలోకి వెళ్లాయి. అమెరికా జట్టు ఈ టోర్నీలో చరిత్ర సృష్టిస్తోంది. ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఈవెంట్‌లో ఇప్పటికే 8 గోల్స్ చేసింది. గతంలో 1930, 2002లో అత్యధికంగా ఏడు గోల్స్ మాత్రమే చేసింది.



ఆద్యంతం వేడుకలా సాగుతున్న ఫిఫా వరల్డ్‌కప్ 2026లో మెక్సికో చరిత్ర సృష్టించింది. లీగ్ దశలో మూడుకు మూడు మ్యాచుల్లో విజయాలతో నాకౌట్‌కు వెళ్లిన ఆతిథ్య జట్టు.. ప్రత్యర్థిని ఒక్కగోల్ కూడా కొట్టనివ్వలే. తద్వారా.. లీగ్ దశలో శత్రు జట్టుకు ఒక్క గోల్ సమర్పించుకోని జట్టుగా రికార్డు పుస్తకాల్లో నిలిచింది.

# మెక్సికో.. పిసినారి!

## లీగ్ దశలో ఒక్క గోల్ ఇవ్వలే

మొత్తంగా సాకర్ వరల్డ్‌కప్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించిన ఆరో జట్టుగా మెక్సికో గుర్తింపు తెచ్చుకుంది. ఈసారి ఫిఫా వరల్డ్‌కప్‌లో రికార్డులు బద్ధలవుతున్నాయి. లీగ్ దశ 33వ మ్యాచ్‌లోనే వంద గోల్స్ నమోదవ్వడం ఓ రికార్డైతే.. ఆతిథ్య మెక్సికో ప్రత్యర్థికి ఒక్క గోల్ ఇవ్వకుండానే నాకౌట్ చేరింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో చిత్తు చేసి.. హ్యాట్రిక్ విజయాలతో ఔరా అనిపించిన మెక్సికో వరల్డ్‌కప్ చరిత్రలో అరుదైన ఫీట్ సొంతం చేసుకుంది. ఇదివరకూ నెదర్లాండ్స్(1974), బ్రెజిల్(1986), ఇటలీ(1990), అర్జెంటీనా(1998), ఉరుగ్వే(2018).. ఈ ఐదు జట్లు మాత్రమే లీగ్ దశలో ప్రత్యర్థిని ఒక్క గోల్ కొట్టనివ్వలేదు. గ్రూప్ ఏలోని మెక్సికో తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాను 0-2తో ఓడించింది. రెండో గేమ్‌లో దక్షిణ కొరియాను వణికిస్తూ 1-0 విజయం సాధించింది. బుధవారం చెక్ రిపబ్లిక్‌ను 3-0తో ఓడించిన మెక్సికో నాకౌట్ బెర్తు పట్టేసింది. మూడు విజయాలు.. ఆరు పాయింట్లతో అగ్రస్థానం దక్కించుకుంది మెక్సికో. 32వ రౌండ్ తొలి మ్యాచ్‌లో మంగళవారం ఎస్టాడియో అజ్టెకాను ఎడ్సన్ అవ్వరెజ్ సారథ్యంలోని మెక్సికో ఢీకొట్టనుంది.

ఈవార్తలు
# ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 27-6-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# ఎంఎస్‌ఎంఈల దూకుడు

దేశ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించేది కేవలం భారీ పరిశ్రమలు మాత్రమే కావు. చిన్న మూలధనంతో ప్రారంభమైన వేలాది పరిశ్రమలు, కుటుంబ ఆధారిత వ్యాపారాలు, స్థానిక ఉత్పత్తి కేంద్రాలు, గ్రామీణ పారిశ్రామిక యూనిట్లు కూడా సమానంగా ఆర్థికాభివృద్ధికి తోడ్పడతాయి. భారతదేశంలో అలాంటి శక్తివంతమైన రంగమే ఎంఎస్‌ఎంఈ. నేడు ఈ రంగం కేవలం ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా, తయారీ, ఎగుమతులు, నవకల్పన, మహిళా పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌ల అభివృద్ధికి కూడా బలమైన పునాదిగా నిలుస్తోంది. ఎంఎస్‌ఎంఈ రంగం భారత ఆర్థిక వ్యవస్థలో వెన్నెముకగా చెప్పబడటానికి కారణాలున్నాయి. దేశవ్యాప్తంగా కోట్లాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధిని కల్పించే ఈ రంగం పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ జీవనోపాధికి ఆధారంగా ఉంది. చిన్న పరిశ్రమలు స్థానిక వనరులను వినియోగిస్తూ ప్రాంతీయ అభివృద్ధికి దోహదపడతాయి. పెద్ద కంపెనీలకు అవసరమైన విడిభాగాలు, ముడి ఉత్పత్తులు, సేవలను కూడా ఇవే అందిస్తుంటాయి. అందుబాటులో ఉన్న తాజా అంచనాల ప్రకారం, భారత స్థూల దేశీయోత్పత్తిలో ఎంఎస్‌ఎంఈ రంగం వాటా సుమారు 30 శాతం వరకు ఉంది. దేశ ఎగుమతుల్లో సుమారు 45 శాతం వరకు ఈ రంగం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వాటా కలిగి ఉందని వివిధ ప్రభుత్వ, పరిశ్రమల అంచనాలు సూచిస్తున్నాయి. తయారీ, హస్తకళలు, వస్త్రాలు, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఆహార ప్రాసెసింగ్, తోలు ఉత్పత్తులు, ఔషధ అనుబంధ పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో ఎంఎస్‌ఎంఈలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఒకప్పుడు స్థానిక మార్కెట్‌కే పరిమితమైన చిన్న వ్యాపారాలు ఇప్పుడు ఈ-కామర్స్, డిజిటల్ చెల్లింపులు, సోషల్ మీడియా మార్కెటింగ్, ఆన్‌లైన్ ఎగుమతుల ద్వారా ప్రపంచ వినియోగదారులను చేరుకుంటున్నాయి. డిజిటల్ సాంకేతికత వల్ల మార్కెటింగ్ ఖర్చులు తగ్గడంతో పాటు కొత్త మార్కెట్లలోకి ప్రవేశించడం సులభమవుతోంది. ఇది చిన్న వ్యాపారాలకు పోటీ సామర్థ్యాన్ని పెంచుతోంది. అయితే ఎంఎస్‌ఎంఈల ఎదుగుదలలో అనేక అడ్డంకులు ఉన్నాయి. తక్కువ వడ్డీతో రుణాల లభ్యత, ముడి పదార్థాల ధరల పెరుగుదల, సాంకేతికతలో వెనుకబాటు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, పెద్ద కంపెనీలతో పోటీ, చెల్లింపుల జాప్యం వంటి సమస్యలు చిన్న పరిశ్రమలను ఇబ్బంది పెడుతున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల నుంచి బకాయిలు ఆలస్యంగా రావడం వల్ల నగదు ప్రవాహం దెబ్బతిని అనేక యూనిట్లు ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ప్రపంచ సరఫరా గొలుసులు మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ తయారీ కేంద్రంగా ఎదగాలంటే ఎంఎస్‌ఎంఈలను బలోపేతం చేయడం తప్పనిసరి. కృత్రిమ మేధ, ఆటోమేషన్, గ్రీన్ టెక్నాలజీ, డిజిటల్ ఉత్పత్తి విధానాలను చిన్న పరిశ్రమలకు అందుబాటులోకి తీసుకురావాలి. నాణ్యత ప్రమాణాలు, పరిశోధన, ఎగుమతి సామర్థ్యాన్ని పెంచే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

# అక్షరార్ణవములో ఆణిముత్యాలు

అనతి కాలములోనే సుప్రసిద్ధి జెందిన వినూత్న ప్రక్రియ మణిపూసలు. ఈ ప్రక్రియలో నిర్దిష్ట మాత్రా ఛందస్సులో నాలుగు పాదాలతో ఒకటవ, రెండవ మరియు నాల్గవ పాదాలు అంత్య ప్రాస కలిగియుంటావి. మణిపూసలో ఏదైన ఒక వస్తువును ఎన్నుకొని ఒకటి లేదా అనేక మణిపూసలో కవి తన భావమును వ్యక్త పరచడం జరుగుతుంది. శ్రీ కల్లూరి ప్రభాకరాచారిగారు తన "భావజలధి" సప్తశతి మణిపూసల్లో వివిధ రంగాలలో నిష్ణాతులైన ఏబది రత్నాలను ఏరుకొని వారి ఔన్నత్యమును స్పృశిస్తూ తన మణిపూసల్లో సులభ శైలిలో వివరించారు. వ్యక్తుల గురించే కాకుండా పలు సామాజిక అంశాలపై తన కలమును నడిపించారు. మొదటి మణిపూసలో...

శ్రీ గణేశ నిన్నుమించు
దేవుడెవరు లేరటంచు
మ్రొక్కెదను లంబోదర
మోదమలర మమ్ముగాంచు!

అంటూ హైందవ సంప్రదాయములో ఏదైన విశిష్ట శుభ కార్యక్రమము చేపట్టినపుడు భగవంతుని ఆరాధించడం ఆనవాయితి. కవి ప్రభాకరాచారి సంపత్కరమైన శ్రీ అక్షరముతో ఆది గురువు విఘ్న వినాశకుని "శ్రీగణేశ....." అంటూ తన మొదటి మణిపూసను ప్రారంభించి, తన కవిత్వమునకు విఘ్నములు జరుగకుండా చూడుమని, నిన్ను మించిన దేవుడు వేరెవరు లేడంచు వేడుకున్నారు.




రామకృష్ణ ప్రియ శిష్యుడు
ఆధ్యాత్మిక నాయకుండు
వేదాంత విచార ధార
తెల్పినట్టి తాత్వికుండు!

అమెరికాలోని చికాగో పట్టణములో జరిగిన ప్రపంచ ఆధ్యాత్మిక మహాసభలో భారతీయ హైందవ వేదాంత తత్వ మూలాలను ప్రబోధించి భారతదేశౌన్నత్యమును ప్రపంచ ఆధ్యాత్మికోన్నతులకు కూడా విస్మయము కలిగించిన స్వామీ వివేకానందును గూర్చి ప్రభాకరాచారిగారు పై తన మణిపూసలలో అద్భుతంగా వివరించారు.

అదే విధంగా దాశరథి కృష్ణమాచారి తెలంగాణ సుప్రసిద్ధ సినీ గేయ కవియేగాక వచన, పద్య కవిత్వములలో కూడా అగ్రేసరుడు, నిజాము నియంత పరిపాలనకు విరుద్ధముగా జరిగిన ఉద్యమాలలో పాల్గొని జైలు శిక్షను అనుభవించిన మహా కవి. జైలులో చదువుటకు వ్రాయుటకు అనుమతి లేకున్నను బొగ్గుతో జైలు గోడలపై నిరంకుశ నిజాము కిరాతక చర్యలపై తన కవితావేశమును నిర్భయముగా ప్రకటించిన ధీశాలి దాశరథి. కష్టించి ఎడారులను మాగాణముగా మార్చి పంటలు పండించిన రైతులదే ఈ తెలంగాణము. ముసలినక్క నిజాముది కానే కాదని బాహాటంగా ప్రకటించిన కవియోద్ధ దాశరథి. కవి కల్లూరి ప్రభాకరాచారి తన ఆణిముత్యాలైన మణి పూసలలో దాశరథి గురించి తన భావాన్ని అద్భుతంగా ప్రకటించిన తీరు ఈ క్రింది మణిపూసను చూస్తే పాఠకులకు అర్థమౌతుంది.

అక్షరాల అగ్నికణం
రగిలించుచు ప్రతీక్షణం
జైలు గోడలే సాక్షిగ
తీర్చినావు తల్లి రుణం!

ఏ.పి.జె. అబ్దుల్ కలామ్ భారత దేశానికి లభించిన అరుదైన శాస్త్రవేత్త. పేదరికములో జన్మించి ఆర్థిక కష్టాలను భరిస్తూ అత్యున్నత శాస్త్రవేత్తగా ఎదిగి భారతదేశ రక్షణశాఖను పటిష్ఠం చేసి "మిస్సాయిల్ మ్యాన్" గా పేరు గడించిన నిర్మాలిన్య నిరాడంబర అజాతశత్రువు కలామ్. ఐదు సంవత్సరాలు రాష్ట్రపతిగా తన అమూల్య సేవలను నిస్వార్థంగా అందించి నిరుపేదగానే పదవీ విరమణ పొందిన అనుపమాన మహోన్నత వ్యక్తిత్వము గలిగిన శాస్త్ర వేత్త కలామ్. కవి ప్రభాకరాచారి తన మణిపూసలో కలామ్ ఔన్నత్యమును అక్షరబద్ధము చేసి చూపించిన విధము అనుపమానము, ప్రశంసనీయము. ఈ క్రింది మణిపూసను గమనించండి.

శాస్త్రవేత్త, రాష్ట్రపతిగ
ఉన్నత శిఖరాలకెదగ
సామాన్యునివలె మీరు
సాగినారు పదవినిడగ!

కవి శ్రీ ప్రభాకరాచారి ప్రఖ్యాత వ్యక్తుల గురించే కాకుండా వివిధ సామాజిక అనేకాంశాలపైన గూడా తన మణిపూసలలో కలమును ఝులిపించారు. "రవి గాంచని చోటు కవి గాంచును" అన్నట్లు తాను స్పృశించని అంశము లేదంటే అతిశయోక్తి కాదేమో. ఈ చిన్న మణిపూసలో ప్రభాకర్ గారు ప్లాస్టిక్కు వలన జరిగే అనర్థాలను వివరించిన తీరు కొనియాడ తగినదే.

అంతా ప్లాస్టిక్కు మయం
జగమంతా అయోమయం
వ్యర్థ పదార్థాల వలన
కల్గును రోగాల భయం!

కల్లూరి ప్రభాకరాచారి గారు రచించిన ఈ సప్తశతి "భావజలధి" మణిపూసల గ్రంథము పలువురి ప్రశంసలు అందుకొని సాహితీ జగత్తులో సుస్థిర స్థానముపొంది కలకాలము ప్రకాశిస్తూ ఉండాలని ఆశిస్తూ అభినందిస్తున్నాను.

ప్రభాకరార్య! జే జేలు
వ్రాసినారు మణిపూసలు
"సప్తశతి భావజలధి"
అందించునిల ప్రశంసలు!



గండూరి లక్ష్మీనారాయణ
విశ్రాంత ప్రధానోపాధ్యాయులు,
9423956248



## ప్రపంచం ఒకవైపు.. భారత్ ఇంకోవైపు!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గత కొన్నేళ్లుగా వరుస సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఒక ప్రాంతంలో యుద్ధం, మరో ప్రాంతంలో వాణిజ్య ఆంక్షలు, ఇంకెక్కడో సముద్ర మార్గాల్లో అంతరాయాలు-ఈ పరిణామాలు కేవలం సంబంధిత దేశాలకే పరిమితం కావడం లేదు. గ్లోబలైజేషన్ యుగంలో ఒక దేశంలోని ఉద్రిక్తత ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి, రవాణా, ఇంధన ధరలు, పెట్టుబడులు, వినియోగంపై ప్రభావం చూపుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచంలో వేగంగా ఎదుగుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారతదేశం ముందున్న దారి అవకాశాలతో పాటు పరీక్షలతో కూడుకున్నది. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా గుర్తింపు పొందుతోంది. స్థిరమైన దేశీయ వినియోగం, విస్తరిస్తున్న సేవారంగం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు ఈ వృద్ధికి బలం చేకూరుస్తున్నాయి. అయితే అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నుంచి భారత్ పూర్తిగా దూరంగా ఉండలేని పరిస్థితి.

భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 85 శాతానికి పైగా విదేశీ దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు పెరిగితే దాని ప్రభావం దేశీయంగా పెట్రోల్, డీజిల్, ఎరువులు, రవాణా, తయారీ వ్యయాలపై పడుతుంది. ఫలితంగా ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంటుంది. ఇంధన ధరల అస్థిరత ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకూ సవాలుగా మారుతుంది. ఇటీవలి కాలంలో అనేక అంతర్జాతీయ కంపెనీలు తమ ఉత్పత్తి కేంద్రాలను ఒకే దేశంలో కేంద్రీకరించకుండా విభిన్న ప్రాంతాలకు విస్తరించే వ్యూహాన్ని అవలంబిస్తున్నాయి. ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకునే సామర్థ్యం భారత్‌కు ఉంది. పెద్ద వినియోగదారుల మార్కెట్, యువ జనాభా, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగవుతున్న మౌలిక సదుపాయాలు విదేశీ పెట్టుబడులను ఆకర్షించగలవు. ఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, రక్షణ తయారీ, సెమీకండక్టర్ అనుబంధ రంగాల్లో భారత్‌కు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగే అవకాశాలు ఉన్నాయి. ఈ రంగాల్లో దీర్ఘకాలిక విధాన స్థిరత్వం, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనకు ప్రాధాన్యం ఇస్తే ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయి.

ప్రపంచ ఆర్థిక మందగమనం లేదా ప్రధాన మార్కెట్లలో డిమాండ్ తగ్గితే భారత ఎగుమతులపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, రత్నాభరణాలు వంటి రంగాలు అంతర్జాతీయ డిమాండ్‌పై ఆధారపడతాయి. అందువల్ల ఎగుమతి గమ్యస్థానాలను విస్తరించడం, కొత్త మార్కెట్లను అన్వేషించడం అత్యవసరం. ప్రపంచ ఉద్రిక్తతల కారణంగా ఎరువుల ధరలు, రవాణా ఖర్చులు, సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే రైతులకు సాగు వ్యయం పెరుగుతుంది. అదే సమయంలో వాతావరణ మార్పులు, అనిశ్చిత వర్షపాతం వ్యవసాయ రంగాన్ని మరింత ప్రభావితం చేస్తున్నాయి. దీంతో ఆహార ధరల స్థిరత్వాన్ని కాపాడటం కూడా ప్రభుత్వాలకు సవాలుగా మారుతోంది. సాంకేతిక సేవలు, ఫిన్‌టెక్, డిజిటల్ చెల్లింపులు, కృత్రిమ మేధ, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు వంటి రంగాల్లో భారత్ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. సేవారంగ ఎగుమతులు భారత విదేశీ మారక నిల్వలకు బలాన్నిస్తుండగా, స్టార్టప్ ఎకోసిస్టమ్ కూడా కొత్త పెట్టుబడులను తీసుకొస్తోంది. తయారీ రంగంతో పాటు జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం భవిష్యత్తులో కీలకం.

ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించాలంటే రోడ్లు, రైల్వేలు, పోర్టులు, లాజిస్టిక్స్, విద్యుత్, డిజిటల్ కనెక్టివిటీ వంటి రంగాల్లో నిరంతర పెట్టుబడులు అవసరం. తయారీ వ్యయాన్ని తగ్గించడం ద్వారా భారత పరిశ్రమలు అంతర్జాతీయ పోటీలో మెరుగైన స్థానాన్ని సంపాదించగలవు. ప్రపంచంలో 5వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఇప్పటికే స్థిరపడింది. స్థూల దేశీయోత్పత్తి విలువ సుమారు 4 ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పైగా చేరుకుంది. ముడి చమురు అవసరాల్లో 85% కంటే ఎక్కువ దిగుమతుల ద్వారానే తీరుతోంది. సేవారంగం భారత జీడీపీలో సుమారు 55%కు పైగా వాటా కలిగి ఉంది. తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, ఎగుమతుల విస్తరణ, నైపుణ్యాభివృద్ధి రాబోయే దశాబ్దంలో ఆర్థిక వృద్ధికి కీలక స్తంభాలు. ప్రపంచంలో భౌగోళిక ఉద్రిక్తతలు త్వరగా ముగిసే సూచనలు కనిపించకపోయినా, వాటిని అవకాశాలుగా మలచుకునే దేశాలే ముందంజలో నిలుస్తాయి. భారత్‌కు ఉన్న అతిపెద్ద బలం యువశక్తి, విస్తారమైన అంతర్గత మార్కెట్, సాంకేతిక సామర్థ్యం. కానీ అదే సమయంలో ఇంధన భద్రత, సరఫరా గొలుసుల వైవిధ్యం, ఎగుమతుల విస్తరణ, దేశీయ తయారీ, పరిశోధన-ఆవిష్కరణలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలో ప్రతి సంక్షోభం ఒక పరీక్ష మాత్రమే కాదు.. ఒక అవకాశం కూడా. యుద్ధాలు, వాణిజ్య వివాదాలు, ఇంధన అస్థిరత వంటి పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థకు తాత్కాలిక ఒత్తిడిని తెచ్చిపెట్టవచ్చు. అయితే సరైన విధానాలు, వేగవంతమైన సంస్కరణలు, సాంకేతిక పెట్టుబడులు, తయారీ సామర్థ్య విస్తరణ ద్వారా భారత్ ఈ సవాళ్లను అభివృద్ధి అవకాశాలుగా మార్చుకునే స్థితిలో ఉంది.



శశిధర్ అక్కెల

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.